అమాత్యులు ఎవరో!



ఏడు నియోజకవర్గాల్లో అదృష్టవంతులెరో


- పురందేశ్వరికి కేంద్ర మంత్రి పదవి?
- రాష్ట్ర మంత్రి పదవులకు తీవ్ర పోటీ
- సీనియర్ కోటాలో గోరంట్లకు చాన్స్?
- ఎస్సీ కోటాలో మద్దిపాటికి దక్కేనా
- కందుల, బత్తుల ప్రయత్నాలు
- బీజేపీ కోటాలో నల్లమిల్లికి ఆశ
- మరో మూడు రోజుల్లో స్పష్టత

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గెలిచేశాం.. వాట్‌నెక్స్ట్.. ఇంకేముంది.. ఎలాగైనా మంత్రి వర్గంలో చోటు సంపాదించాలి.. ఇదీ నాయకుల ఆశ.. ఆ దిశగా ఎవరికి వారు ఇప్పటికే ప్రయత్నాలు ఆరంభించారు.. ఎవరు మంత్రి అవుతారు.. ఎవరు ఎమ్మెల్యేగా ఉంటారనేది త్వరలో తేలనుంది. ఎందుకంటే ఈ సారి మంత్రివర్గ కూర్పులో తీవ్ర పోటీ ఉంటుంది...ఈ సారి టీడీపీ,జనసే, బీజేపీ కూటమిగా ఏర్పడి బరిలో దిగాయి. 175 స్థానాలకు ఏకంగా 164 సీట్లలో విజయం సాధించాయి.ఈ నేపథ్యంలో ఎవరిని మంత్రి పదవి వరిస్తుందనే దానిపై అంచనాలు వేసుకుంటున్నారు. తెలుగుదేశం-జనసేన- బీజేపీ కూటమి అఖండ విజయం సాధించిన నేపథ్యంలో కేంద్రంలోనూ, రాష్ట్రం లోనూ ఎన్‌డీఏ ప్రభుత్వాలు ఏర్పడనున్నాయి. రాష్ట్రంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఈ నెల 12వ తేదీన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ ఈ నెల 9వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్న సంగతి తెలిసిందే. జిల్లాలో కూటమి తరపున గెలిచిన అభ్యర్థుల్లో కొందరు మంత్రి పదవులను ఆశిస్తున్నారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ నుంచి అత్యధిక మెజార్టీతో గెలిచిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి కేంద్ర మంత్రి పదవి వచ్చే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతుంది.రాజమండ్రి లోక్‌సభ చరిత్రలో ఇంత వరకూ ఎవరికీ రానంత మెజార్టీ ఆమెకు లభించిన సంగతి తెలిసిందే.2014లో జరిగిన ఎన్నికల్లో మాగంటి మురళీ మోహన్‌కు 1,67,434 ఓట్ల మెజార్టీ లభించింది. ప్రస్తుతం పురందేశ్వరికి 2,39,139 ఓట్ల మెజార్టీ లభించింది.పైగా ఆమె ఎన్టీఆర్ కూతురు. పైగా ఆమె బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా కూడా ఉన్న సంగతి తెలిసిందే.ఈ పరిస్థితుల్లో ఆమెకు కేంద్ర మంత్రి పదవి వచ్చే అవకాశం ఉన్నట్టు విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. గతంలో ఒకసారి ఆమె కేంద్ర మంత్రి పదవిని నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆమెకు పదవి కచ్చితంగా వస్తుందనే వార్తలు వస్తున్నాయి. ఆదివారం ప్రధాని మోదీ ప్రమాణ స్వీకారం చేస్తున్నారు. కాబట్టి మంత్రి వర్గం కూడా అప్పుడే ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆమెకు మంత్రి పదవి వచ్చే అవకాశం ఉంటే శనివారం రాత్రిలోపు సమాచారం అందుతుంది. ప్రస్తుతం ఆమె ఢిల్లీలోనే ఉన్నారు. ఎన్డీఏ పక్షాల మీటింగ్ కోసం ఆమె వెళ్లారు. ఇక రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా కూటమి తరపున తెలుగుదేశం అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 12న ప్రమాణ స్వీకారం చేస్తున్నారు. అదే రోజు మంత్రి వర్గం కూడా ఏర్పడనుంది. జిల్లా నుంచి గెలిచిన వారంతా పదవులు ఆశిస్తున్నారు. ముఖ్యంగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సీనియర్ టీడీపీ నేత, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి మంత్రి పదవి వస్తుందనే ప్రచారం జరుగుతోంది. సామాజిక వర్గాల సమీకరణల నేపథ్యంలో పరిస్థితులు ఎలా ఉంటాయో చెప్పలేని స్థితి నెలకొంది. సీనియర్‌నేత కావడం వల్ల ఆయనకు మంత్రి పదవి ఇవ్వడం సబబనే వాదన ఉంది. ఇక ఎస్సీ కోటాలో గోపాలపురం నియోజకవర్గం నుంచి మంత్రి తానేటి వనితను ఓడించి విజేతగా నిలిచిన మద్దిపాటి వెంకట్రాజుకు కూడా మంత్రి పదవి వచ్చే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆయన జిల్లా మంత్రిని ఓడించడంతో పాటు, తెలుగుదేశం అధినేత చంద్రబాబు, నారా లోకేశ్‌కు బాగా సన్నిహితంగా ఉండే నాయకుడు. ఈ పరిస్థితుల్లో ఆయన పేరు మంత్రి పదవి కోటాలో బలంగా వినిపిస్తోంది. ఇక కొవ్వూరు ఎమ్మెల్యే విజేత ముప్పిడి వేంకటేశ్వరరావు, రాజ మండ్రి సిటీ నుంచి అత్యధిక మెజార్టీతో, విజేతగా నిలిచిన ఆదిరెడ్డి వాసు పదవి ఆశిస్తున్నారు. ఇక బీజేపీ కోటాలో తనకు అవకాశం ఉండొచ్చనే ఆలోచనలో అనపర్తి ఎమ్మెల్యే విజేత నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వర్గం భావిస్తోంది. పురం దేశ్వరికి కేంద్ర మంత్రి పదవి వస్తే ఆయన పేరు పరిశీలనలో ఉండకపోవచ్చు.ఇక మరో ముఖ్యమైన పార్టీ జనసేన. నిడదవోలు నుంచి కందుల దుర్గేష్, రాజానగరం నుంచి బత్తుల బలరామకృష్ణ గెలిచిన సంగతి తెలిసిందే. జనసేనలో కాపు కోటాలో ఒకరికి అవకాశం ఉండవొచ్చనే ప్రచారం జరుగుతోంది. కందుల దుర్గేష్ జనసేన సీనియర్‌నేత. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడిగా, జనసేనపొలిటికల్ ఎఫైర్స్‌కమిటీ సభ్యుడిగా ఉన్నారు. ఆయనకు ప్రాధాన్యత ఉండొచ్చనే ప్రచారం ఉంది. ఇక బత్తుల బలరామకృష్ణ కూడా తన ప్రయత్నాలు తాను చేస్తున్నట్టు తెలుస్తోంది. చివరకు తెలుగుదేశం, జనసేన, బీజేపీ మూడు పార్టీల అధినేతలు కూర్చుని, సామాజిక వర్గాలు,ప్రాంతాలు, సీనియార్టీ వంటివన్నీ పరిగణనలోకి తీసుకుని ఎవరికి మంత్రి పదవి ఇవ్వాలనేది నిర్ణయిస్తారు. రెండు మూడు రోజుల్లో ఎవరికి పదవనేది స్పష్టత రానున్నది.


గోరంట్ల

వీళ్లొద్దనే మాట.. అందరి నోటా!



- జిల్లాలో నోటాదే మూడో స్థానం
- ఐదు నియోజకవర్గాల్లో ఇంతే
- రాజమండ్రి రూరల్‌లో 4వ స్థానం
- ప్రభావం చూపని స్వతంత్రులు
- జిల్లాలో మొత్తం 71 మంది అభ్యర్థులు
- ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్యే పోటీ
- కాంగ్రెస్‌కు అంతంతమాత్రమే ఓట్లు
- రాజానగరంలో ఏడు బ్యాలెట్ ఓట్లు
- లోక్‌సభ బరిలో 24 వేల ఓట్లు

రసవత్తరంగా జరిగిన సాధారణ ఎన్నికల్లో అందరి నోటా ఒకటే మాట.. ప్రతి నియోజక వర్గంలోనూ వేలాది మంది వీళ్లొద్దనే చెప్పారు.. తమకు ఏ అభ్యర్థీ నచ్చలేదని తీర్పునిచ్చారు. ఎందుకంటే జిల్లాలో మొత్తం 83 మంది అభ్యర్థులు అటు లోక్‌సభ.. ఇటు అసెంబ్లీ స్థానాల నుంచి పోటీపడ్డారు. వీరిలో ప్రధాన పార్టీలైన టీడీపీ/జనసేన / బీజేపీ కూటమి, వైసీపీ అభ్యర్థుల మధ్యే పోరు జరిగింది.ఏ నియోజక వర్గంలో చూసినా మూడో స్థానం మాత్రం నోటాకే దక్కింది. ఆరు నియోజకవర్గాల్లోనూ పరిస్థితి ఇలాగే ఉంది. స్వతంత్ర అభ్యర్థుల శక్తి నోటా కన్నా తక్కువగా ఉంది. ఎన్నికల తంతు మొదలైనప్పటి నుంచి ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్రుల హడావుడి కూడా ఎక్కువైంది. తీరా కౌంటింగ్ చూస్తే నోటా కన్నా తక్కువగా ఓట్లు రావడంతో స్వతంత్రులంతా తెల్ల మొహం వేశారు.

గోపాలపురం 4500 ఓట్లు..

గోపాలపురం, జూన్ 7 : గోపాలపురం నియోజకవర్గంలో 10 మంది అభ్యర్థులు పోటీలో ఉంటే వారిలో ఆరుగురు స్వతంత్రులు, కాంగ్రెస్ అభ్యరి ఒకరు,బీఎస్పీ అభ్యర్థి ఒకరున్నారు. వారిలో పట్టుమని 200 ఓట్లు రాని వారు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీపడ్డారు. ఏ ఎన్నికైనా ప్రజల్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ గుర్తు కీలకమనేది సుస్పష్టం. ఎందరూ పోటీలో ఉన్నా ప్రధాన పార్టీల అభ్యర్థులకే ఓట్లు వేస్తారు. అధికార, ప్రతిపక్ష పార్టీ లకు ఓట్లు వేయకపోతే చివరికి నోటాకి నొక్కేస్తారు. స్వతంత్రులను కనీసం పరిగణనలోకి తీసుకోవడంలేదు. గోపాలపురంలో ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులకు పోలైన ఓట్ల కంటే నోటాకు పోలైన ఓట్లే ఎక్కువ. ఇదిలా ఉంటే పోస్టల్ బ్యాలెట్ ఓటు ఒకటంటే ఒక్కటైన స్వతంత్రులకు దక్కలేదు. నియోజకవర్గంలో స్వతంత్రులకు పోలైన ఓట్ల వివరాలు ఇలా ఉన్నాయి.పెనుమాక వెంకటరత్నంకు పోలైన ఓట్లు 342, బాతుల వేణుకు పోలైన ఓట్లు 206, శ్రీనివాసరావు ములగాలకు పోలైన ఓట్లు 166, దొడ్డిగర్ల నాగార్జునకు పోలైన ఓట్లు 168, ముక్కవల్లి వెంకటరమణకు పోలైన ఓట్లు 271, రాపాక హరీష్‌కుమార్‌కు పోలైన ఓట్లు 528 ఉన్నాయి. స్వతంత్రుల్లో ఒకరికి గరిష్టంగా 528 ఓట్లు పడగా మరొకరికి కనిష్టంగా 166 ఓట్లు మాత్రమే దక్కాయి. ప్రధాన పార్టీలకే నియోజ కవర్గ ఓటర్లు మొగ్గు చూపారని స్వతం త్రులను పరిగణన లోకి తీసుకోలేదని తేటతెల్లమైంది. ఇదిలా ఉండగా నోటాకు పోలైన ఓట్లు 4488, పోస్టల్ బ్యాలెట్ - 12, మొత్తం 4500.

కొవ్వూరులో 2465 ఓట్లు..

కొవ్వూరు, జూన్ 7 : సార్వత్రిక ఎన్నికల్లో కొవ్వూరు నియోజకవర్గంలో నోటా మూడో స్థానంలో నిలిచింది. కొవ్వూరు నియోజకవర్గం నుంచి ఇటీవల జరిగిన ఎన్నికలలో 11 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. కూటమి అభ్యర్థి, వైసీపీ, కాంగ్రెస్ పార్టీలతో పాటు మరో 8 మంది బరిలో నిలిచారు. కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావుకు 92,743, వైసీపీ అభ్యర్థి తలారి వెంకట్రావుకు 58,797 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి అరిగెల అరుణకుమారికి 1897 ఓట్లు,నోటాకు 2465 ఓట్లు,స్వతంత్రులు మిగిలిన 8 మందికి కలిపి 3209 ఓట్లు పడ్డాయి. అంటే ఇక్కడ కూడా నోటాదే మూడో స్థానం.

నిడదవోలులో 2137 ఓట్లు..

నిడదవోలు, జూన్ 7 : నిడదవోలు నియోజకవర్గంలో నోటాదే మూడో స్థానం. నిడదవోలు నియోజకవర్గంలో 13 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ప్రధాన పార్టీలైన తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి, వైసీపీ అభ్యర్థుల మధ్య ప్రధాన పోటీ నెలకొంది. అయితే స్వతంత్రులు, ఇతర పార్టీల నాయకులు 11 మంది ఉన్నా ఎవరూ అంతగా ప్రభావం చూపలేదు. దీంతో మూడో స్థానం నోటాకే దక్కింది. స్వతంత్ర అభ్యర్థులు కొట్టియాడ దుర్గకు 454 ఓట్లు, అరిగెల సత్య వరప్రసాద్‌కు 478 ఓట్లు, వెంకటేశ్వరనాయుడు గిద్దాకు 347 ఓట్లు, శ్రీనివాస్‌నాయుడు గిద్దాకు 283 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి పెద్దిరెడ్డి సుబ్బారావుకు 1495 ఓట్లు, పిరమిడ్ పార్టీ అభ్యర్థి ముక్కామల అన్నవర ప్రసాద్‌కు 278 ఓట్లు, జై భారత్ పార్టీ అభ్యర్థి పులమాల వీరభద్రంకు 311 ఓట్లు రాగా ఒక్క నోటాకే 2137 ఓట్లు వచ్చాయి. అంటే ఇక్కడ కూడా నోటాదే పైచేయిగా నిలిచింది.

రాజమండ్రి రూరల్ 2699

కడియం, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం నుంచి 8 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ప్రధానంగా కూటమి అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, వైసీపీ అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణల మధ్య పోటీ నెలకొంది.ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరికి 1,29,060 ఓట్లు,వైసీపీ అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు 64,970 ఓట్లు వచ్చాయి. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (ఐఎన్‌సీ) అభ్యర్థి బాలేపల్లి మురళీధర్‌కు 2,728 ఓట్లతో తృతీయ స్థానం, నాలుగో స్థానంలో నోటాకు 2,699 ఓట్లు పోలయ్యాయి. బీఎస్పీ అభ్యర్థి కొండపల్లి సూరిబాబుకు 1,217 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి చింతలపాటి పవన్‌కుమార్‌కు 714 ఓట్లు, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థి దుగ్గిరాల శ్రీదేవికి 360 ఓట్లు, జైభారత్ నేషనల్ పార్టీ మన్నవ రఘురామ్‌కు 310 ఓట్లు పడ్డాయి. ఈ నియోజకవర్గంలో నోటాకు నాల్గవ స్థానం దక్కడం విశేషం.

అనపర్తిలో 3093..

అనపర్తి, జూన్ 7 : అనపర్తి నియోజకవర్గ ఎన్నికల్లో బీజేపీ, వైసీపీ, కాంగ్రెస్ పార్టీలతో సహా తొమ్మిది మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. వీరిలో ఏడుగురు వివిధ పార్టీలకు చెందిన వారు కాగా ఇరువురు స్వతంత్ర అభ్యర్థులుగా రంగంలోకి దిగారు. బీజేపీ అభ్యర్థికి 1,04,705 ఓట్లు రాగా సమీప వైసీపీ అభ్యర్థికి 84,138 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీకి 1276 ఓట్లు రాగా ఇతరులకు 1750 ఓట్లు వచ్చాయి. నోటాకు మాత్రం 3093 ఓట్లు పడ్డాయి. ఇక్కడ ప్రధాన అభ్యర్థుల మినహా కాంగ్రెస్ సహా ఏడుగురు అభ్యర్థులకు 3026 ఓట్లు నోటాకు 3093 ఓట్లు వచ్చాయి. దీంతో ఏడుగురు అభ్యర్థులపైనా నోటాదే పైచేయిగా ఉంది.

రాజానగరంలో 2975 ఓట్లు

దివాన్‌చెరువు/ రాజానగరం : సార్వత్రిక ఎన్నికల్లో రాజానగరం నియోజకవర్గంలో నోటాకు మూడోస్థానం దక్కడం గమనార్హం. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాజానగరం నియోజకవర్గం నుంచి 12 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. వీరిలో టీడీపీ, బీజేపీ,జనసేన కూటమి అభ్యర్థిగా పోటీచేసిన బత్తుల బలరామకృష్ణకు 1,05,995 ఓట్లు, వైసీపీ అభ్యర్థి జక్కంపూడిరాజాకు 71,946 ఓట్లు లభించాయి.కూటమి అభ్యర్థి బత్తుల 34,049 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. మూడో స్థానంలో నోటాకు ఓట్లు ఎక్కువ పడ్డాయి. నోటాకు 2968 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా మరో ఏడు ఓట్లు వెర 2975 ఓట్లు లభించాయి. ప్రధాన రాజకీయ పార్టీ కాంగ్రెస్ అభ్యర్థి ముంద్రు వెంకట శ్రీనివాస్(పెదబాబు)1901 ఓట్లు సాధించారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూడా రాజానగరం నియోజకవర్గంలో నోటాకు 2200 ఓట్లు వచ్చాయి. ఆ ఎన్నికల్లో నోటా నాలుగో స్థానంలో నిలవడం గమనార్హం.

24 వేల మంది నోట నోటా..

రాజమహేంద్రవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఈసారి ఎన్నికల్లో నోటా కూడా ప్రధాన అభ్యర్థిగా నిలిచింది. రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలో స్వతంత్ర అభ్యర్థులు నోటా ముందు నోరు మూసుకోక తప్పలేదు. ఏ నియోజకవర్గంలో చూసినా స్వతంత్ర అభ్యర్థుల కంటే ఎక్కువగా నోటాకు ప్రజలు ఓటేశారు. అనపర్తిలో 3453, రాజానగరం 4077, రాజమండ్రి సిటీ 1992,రూరల్ 2938, కొవ్వూరు 3012, నిడదవోలు 2782, గోపాలపురం నియోజకవర్గంలో 6048 కలిపి మొత్తం 24302 మంది నోటాను ఎంచుకున్నారు. స్వతంత్ర అభ్యర్థుల్లో గణేశ్వరరావు పరమటకు 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో అధికంగా 20277 ఓట్లు పడగా.. ఆ సంఖ్య కంటే నోటాకు 4158 ఓట్లు అధికంగా పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్లలో కూడా 133 నోటాకు వేశారు. పార్లమెంట్ సెగ్మెంట్‌లోని మొత్తం ఓటర్లలో 1.80% నోటాకు ఓటేశారు.

చుక్కలో.. నొక్కు డెంత!



ఐదేళ్లుగా క్యాష్ పెట్టు..బాటిల్ పట్టు

- అంతంతమాత్రంగా డిజిటల్ లావాదేవీలు
- కోర్టు చెప్పినా బేఖాతర్
- ఎందుకనేది జగన్‌కెరుక
- ఎన్నికల షెడ్యూల్ వచ్చాక అమలు
- ఉన్నతాధికారులపై ఒత్తిడి
- గత నెలలో రూ.6 కోట్లు డిజిటల్
- చివరిలో ఆన్‌లైన్‌పై అనుమానం
- బ్లాక్ మనీగా లెక్కలేస్తున్న జనం
- వెల్లువెత్తుతున్న ఆరోపణలు
- కొత్త ప్రభుత్వం ఏం చేస్తుందో మరి?

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు క్యాష్ పెట్టు.. బాటిల్ పట్టు అనే విధంగా మద్యం వ్యాపారం సాగింది. వందల కోట్ల లావాదేవీలు నగదు రూపంలో జరిగేవి. స్వైపింగ్ లేదు..ఆన్‌లైన్ పేమెంట్లు పనిచేయలేదు.. స్కా నర్లు మూలనపడ్డాయి.. కేంద్రం చెప్పినా, న్యాయస్థానాలు మొట్టికాయలు వేసినా జగన్ ప్రభుత్వం బేఖాతరు చేసింది. అధికారం చివరలో మాత్రం డిజిటల్ పేమెంట్లపై (స్వైపింగ్ /స్కానింగ్) రూపంలోనే చేయాలని మౌఖిక ఆదేశాలు జారీ చేయడంతో మందుబాబులు నివ్వెరపోయారు. మే 25వ తేదీ నుంచి డిజిటల్ చెల్లింపుల విధానాన్ని హఠాత్తుగా అమల్లోకి తెచ్చారు. మూలన పడిన స్వైపింగ్ మిషన్లకు దుమ్ము దులిపారు. ఈ నిర్ణయాన్ని రహస్యంగా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది. డిజిటల్ పేమెంట్ల విధానం తెచ్చిన నాటి నుంచీ ఈ ఏడాది మే నెలలో తొలిసారిగా ఏకంగా రూ.6 కోట్ల డిజిటల్ పేమెంట్లు నమోదయ్యాయి. డిజిటల్‌పై ఇన్నాళ్లు లేని 'దృష్టి' పాలకులు చివరిలో సారించడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. గత ఐదేళ్లుగా డిజిటల్ పేమెంట్లు ఎందుకు చేయ లేదని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నల్లధనం నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుంటే అందుకు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మద్యం దుకాణాల్లో డిజిటల్ లావా దేవీలు తీసుకురావాలని ఎన్నిసార్లు జగన్ సర్కారుకు కేంద్రం లేఖలు రాసినా ఫలితం లేకుండా పోయింది. డబ్బు మూటలకే ఆయన ప్రాధాన్యమిచ్చారు.దీంతో కోట్లాది రూపాయల నల్లధనం అవినీతి దందాలకు తరలిపోయింది. ఐదేళ్లుగా ఈ విధానం యథేచ్ఛగా జరిగింది.

మే 12న హడావుడిగా..

మే(గత నెల) 13న పోలింగ్ జరిగింది. ఆ రోజు సోమవారం. ముందు రోజు ఆదివారం అయినప్పటికీ బ్యాంకులను పని చేయించారు. ఎందుకంటే కేవలం ప్రభుత్వ మద్యం దుకాణాల అమ్మకాలను జమ చేయించడానికి బ్యాంకులను తెరిపించారు. మరి అప్పటి వరకూ ఆ సొమ్ము ఎక్కడకు వెళ్లేదనే ప్రశ్న జగన్ సర్కారునే అడగాలి. ఆ రోజున తిలక్‌రోడ్డులోని ఓ బ్యాంకు బ్రాంచిలో సుమారు రూ.5 కోట్ల వరకూ జమ అయ్యాయి. ఒక ప్రభుత్వ మద్యం దుకాణంలోని సిబ్బంది చేతివాటం ప్రద ర్శిస్తే సుమారు రూ.8 లక్షలను బ్యాంకు సమయం మించిపోయిన తర్వాత కూడా ఎక్సైజు/ ఎస్‌ఈబీ అధికా రులు బ్యాంకు సిబ్బంది కాళ్లావేళ్లాపడి ప్రభుత్వ ఖాతాలో జమ చేశారని సమాచారం.

ధరలను పెంచేసి.. తాగించేసి..

మద్యాన్ని దశలవారీగా నిషేధిస్తామంటూ ప్రగల్భాలు పలికిన జగన్ తర్వాత జనాలతో పూటుగా తాగించడం మొదలు పెట్టారు. పండుగలు తదితర ప్రత్యేక దినాల్లో మద్యాన్ని ఏరులైపారించారు. ధరలను విపరీతంగా పెంచేసి మందుబాబుల జేబులకు వేల కోట్ల రూపాయల చిల్లు పెట్టారు. అంత భారీ మొత్తంలో నగదు లావాదేవీలు ఏ కంపెనీ చేసినా ఎన్‌ఫోర్స్‌మెంటు ఏజెన్సీలు రంగంలోకి దిగేవి. కానీ సర్కారు వారి కంపెనీ కాబట్టి కిక్కురుమనలేదు. డిజిటల్ పేమెంట్లపై న్యాయస్థానాలు సీరియస్ అయితే వెంటనే నాలుగైదు రోజులు హడావుడి చేసేవారు. తర్వాత డిజిటల్ పేమెంట్ల విషయంలో సాంకేతికంగా వంకలు పెట్టేవారు. ఎస్‌బీఐ, పేటీఎం గేట్‌వేల ద్వారా ఆన్‌లైన్ విధానాన్ని జిల్లాలో గతేడాది తీసుకొచ్చారు. దీనిలోనూ మెలికలు పెట్టారు. పేటీఎం ద్వారా క్రెడిట్ కార్డులు పనిచేయవు. ఎవరైనా మందునీసా కొంటే దానిపై ఉండే బార్‌కోడ్‌ని స్కాన్ చేస్తారు. కంప్యూటర్ స్క్రీన్‌పై డిజిటల్, క్యాష్ అనే ఆప్షన్లు కనిపించేవి. డిజిటల్ అని కొట్టగానే పేమెంటు పూర్తయ్యేది. ఒక్కోసారి ప్రాసెస్‌లో ఉండిపోయేది. చాలా సేపటి వరకూ క్లియర్ కాకపోతే ఇబ్బందులు తలెత్తేవి. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ వినియోగించే విశిష్ట యాప్‌లోనూ లోపాలు ఉండేవి. వీటన్నిటినీ ఏదో సరిచేయలేని సమస్యల్లా పట్టించుకునేవాళ్లు కాదు. పైకి డిజిటల్ అని హంగులు చూపిస్తూ నగదు లావాదేవీలను ప్రోత్సహించేవాళ్లు. వందల కోట్ల రూపాయల లావాదేవీలు నగదు రూపంలో జరగడంతో డబ్బు మూటలు వెనకేసుకోవడంలో ఇబ్బంది ఉండేది కాదు. అందుకనే డిజిటల్ లావాదేవీలను ఐదేళ్ల పాటూ ప్రోత్సహించలేదనే విమర్శలున్నాయి. వైసీపీ నాయకులు ఎన్నికల్లో వరదలా పారించిన డబ్బులు కూడా ఆ లావాదేవీల బాపతేనని తెలుస్తోంది.

నెలకూ రూ.100 కోట్ల అమ్మకాలు..

జిల్లాలోని మద్యం అమ్మకాలు ఈ ప్రభుత్వం వచ్చాక నెలకూ రూ.100 కోట్లకు చేరాయి. సుమారు 150 మద్యం దుకాణాలు, 20 బార్‌ల ద్వారా ఆదాయం సమకూరేది. బార్‌లలో ఎక్కువ బ్రాండ్లు లభ్యమైతే.. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో వాళ్లు ఇచ్చినవే కొనుక్కోవాల్సిన పరిస్థితి ఉండేది. అయితే ఎక్కడ కొన్నా అవన్నీ 'జే' బ్రాండ్లే. బెల్టుషాపులకు కొదువ ఉండేదికాదు. వాటికి ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచే మద్యం చాటుమాటుగా సరఫరా అయ్యేది. ఇలా మద్య నిషేధమన్న జగన్ మందుబాబులతో మద్యాన్ని పూటుగా తాగించారు. అయితే ఆ సొమ్ముల్లో చాలా మటకు బ్లాక్‌మనీగా మారిపోయి ఉంటుందని జనం ఆరోపిస్తున్నారు. ఐదేళ్ల లెక్క తీస్తే అసలు విషయం బయటపడుతుందని అనడం గమనార్హం. దీనిపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలంటున్నారు.

ఏడాది అమ్మకాల్లో డిజిటల్ లావాదేవీలివీ..

నెల	మ.అ(కోట్లలో)	డి.పే(కోట్లలో)	శాతం
మే	90.30	1.40	1.55
జూన్	86.60	2.30	2.60
జూలై	85.20	3.20	3.70
ఆగస్టు	80.80	4.10	5.00
సెప్టెంబరు	76.50	4.40	5.50
అక్టోబరు	77.57	3.70	4.60
నవంబరు	75.30	3.80	4.80
డిసెంబరు	84.20	1.10	1.30
(2024)			
జనవరి	99.40	0.25	0.25
ఫిబ్రవరి	78.00	0.10	0.78
మార్చి	83.00	0.69	0.57
ఏప్రిల్	80.00	2.00	1.60
మే	80.00	6.00	5.00

మ.అ అంటే మద్యం అమ్మకాలు..
డి.పే అంటే డిజిటల్ పేమెంట్లు

ఏటిగట్లు తనిఖీ చేసి నివేదిక ఇవ్వండి

అధికారులతో సమీక్షించిన కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం, జూన్7(ఆంధ్రజ్యోతి) : రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని తుఫాన్‌లు, వరదలు వంటి ప్రకృతి విపత్తులను ఎదుర్కొనడానికి అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా.కె.మాధవీలత ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం ఇరిగేషన్, అగ్నిమాపక, వ్యవసాయం, మత్స్యశాఖ, గ్రామీణ నీటిపారుదల శాఖ, రోడ్డు భవనాలు, పంచాయతీరాజ్, మునిసిపాల్టీలు, విద్యుత్, వైద్యఆరోగ్యశాఖ, డివిజన్ మండల స్థాయి అధికారులతో వరదలు, భారీ వర్షాల విపత్తులపై సమీక్షించారు. గతంలో గోదావరి నదికి వచ్చిన వరదలను దృష్టిలో ఉంచుకుని గోదావరి పరీవాహక ప్రాంతపు గట్లను తనిఖీ చేసి నివేదిక అందించాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో మైనర్ ఇరిగేషన్ పరిధిలోని ఉన్న 530 చెరువులను రెవెన్యూ,ఇరిగేషన్ అధికారులు తనిఖీలు చేసి మరమ్మతులు చేయాలన్నారు. వరద ప్రమాదాల నివారణకు ఇసుక బస్తాలు సిద్ధం చేయాలని చెప్పారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పీహెచ్‌సీల్లో మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. శానిటేషన్ నిర్వహణ వ్యవస్థ పట్ల మునిసిపల్, పంచాయతీ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి రోజూ పరిశుభ్రమైన తాగునీటిని ప్రజలకు అందించాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖ అధికారులు రైతు లను దృష్టిలో ఉంచుకుని అధిక వర్షాల వల్ల పంటలకు ఏవిధమైన నష్టం సంభవించకుండా ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా పనులు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా బలహీనమైన వంతెనలు, కల్వర్టులు, ముందుగానే గుర్తించి వాటికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు.మిచౌంగ్ తుఫాన్ కారణంగా కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో బురద కాలువకు 8 గండ్లు పడ్డాయని.. వాటి మరమ్మతుల రూ.25 లక్షలు ఖర్చవుతుందని ఇప్పటికే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని ఇరిగేషన్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆమె స్పందిస్తూ తక్షణం ఆయా పనులు చేపట్టాలని నిదులు మంజూరు చేస్తామన్నారు.వెంకటనగరం, తొర్రిగడ్డ, చాగల్నాడు లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతు పనులు చేపట్టి ఆయకట్టుకు సాగునీరందించే విధంగా సిద్ధంగా ఉండాలన్నారు. రాజమహేంద్రవరం నగరంలో లోతట్టు ప్రాంతాలు ముంపు బారిన పడకుండా నగర పాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టాలని చెప్పారు. ఆవ డ్రైన్ సమస్యపై తహశీల్దార్, డీపీవో డ్రెయిన్లను తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎస్.మాధవరావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి డి.బాలశంకరరావు, మత్స్య శాఖ జిల్లా అధికారి వి.కృష్ణారావు, డీపీవో డి.రాంబాబు, నగర పాలక సంస్థ ఎస్‌ఈ జి.పాండురంగారావు,అగ్నిమాపక అధికారి ఎం.మార్టిన్ లూథర్ కింగ్,ఆర్‌అండ్‌బీ ఈఈ మదుసూధనరావు, ఇరిగేషన్ ఎస్‌ఈ ఎ.శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, రామకృష్ణ, డీఈ ఈ రమేష్‌బాబు,ఏఈలు ఆర్.సునీల్‌బాబు. ఎ.శివ తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి సోయగం..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనంలో శుక్రవారం సాయం సంధ్యవేళ కనిపించిన దృశ్యమిది. సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంది.

- అమలాపురం టౌన్

శస్త్ర చికిత్సా విధానంలో ఫ్యూజ్ కీలకం

జీఎస్ఎల్‌లో ఘనంగా ప్రారంభమైన వర్క్‌షాపు


రాజానగరం, జూన్ 7: శస్త్ర చికిత్సా విధానంలో ఫండమెంట్ యూజ్ ఆఫ్ సర్జికల్ ఎనర్జీ (ఫ్యూజ్)ఎంతో కీలకమని ప్రఖ్యాత అమెరికా వైద్య నిపుణుడు డాక్టర్ జైసా ఓలాస్కీ అన్నారు. రాజా నగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, అమెరికా గాస్ట్రో ఇంటెస్టినల్, ఎండోస్కోపిక్ సర్జన్ల సొసైటీ(ఎస్ఏజీఈఎస్) సంయుక్తంగా జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో రెండురోజుల పాటు నిర్వహించనున్న ఫ్యూజ్ వర్క్‌షాప్ శుక్రవారం ఘనంగా ప్రారంభ మైంది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ జైసా ఓలాస్కీ మాట్లాడుతూ శస్త్రచికిత్సా పరికరాలను సమర్థవంతంగా ఉపయో గించడంలో సాధన అవసరమన్నారు. రోగులకు నిర్వహించే శస్త్ర చికిత్సల్లో ఫ్యూజ్ విధానం వినియోగాన్ని వివరించారు. మరో ముఖ్యఅతిథి న్యూయార్క్‌కు చెందిన డాక్టర్ జాకబ్స్ స్కూల్ ఆఫ్ మెడిసిన్, ప్రొఫెసర్ ఫ్యూజ్ కోర్సు స్థాపకుడు డాక్టర్ స్టీవెన్ షైట్‌బర్గ్ మాట్లాడుతూ ఫ్యూజ్ కోర్సును వినియోగించుకుని రోగుల భద్రత, శస్త్రచికిత్స పనితనం మెరుగుపర్చుకోవాలన్నారు. ఈ వర్క్‌షాప్ ద్వారా నైపుణ్యాలను, జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. నూతన కోర్సు మూలాలు, ప్రయోజనాలను వివ రించారు. మరోఅతిథి సట్టర్ ఈస్ట్ బే మెడికల్ గ్రూప్, సాన్ ఫ్రా న్సిస్కో జనరల్ సర్జన్ డాక్టర్ పాస్కల్ ఫుచ్‌షుబెర్, యూనివర్శిటీ ఆఫ్ కొలరెడో హాస్పిటల్, డెన్వర్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ సర్జరీ వైద్యులు ఎడ్వర్డ్ జోన్స్, స్టోనీ బ్రూక్ యూనివర్శిటీ హాస్పి టల్ (న్యూయార్క్) జనరల్ సర్జన్ డాక్టర్ కింగా పవర్స్ తదితర సీనియర్ సర్జన్లు ఫ్యూజ్ కోర్సు ప్రాముఖ్యతను వివరించారు. జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో కల్పించిన ఆధునిక సిమ్యులేటర్ పరికరాలు వైద్య విద్యార్థులకు ఎంతగానో దోహపడతాయన్నారు. దీనిపై జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు తమ సంస్థలో నిర్వహించే వివిధ శస్త్ర చికిత్సా పరిక రాలు, శస్త్ర చికిత్సా ఫలితాలను మెరుగుపర్చడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని వివరించారు. రెండు రోజులపాటు జరుగనున్న ఫ్యూజ్ వర్క్‌షాప్‌ను ముఖ్యఅతిథి డాక్టర్ జైసా ఓలాస్కీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం అతిథులను జీఎస్ఎల్ యాజమాన్యం ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేసింది.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్యఅతిథులు

దాస సాహిత్య ప్రాజెక్టు ద్వారా
8,600 భక్తి మండలి గ్రూపులు

● టీటీడీ సాహిత్య ప్రాజెక్టు అధికారి ఆనందతీర్థాచార్యులు



ఆలమూరు, జూన్ 7: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి భక్తిదాసుడైన పురందరదాసు కీర్తనలను ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి దాస సాహిత్య ప్రాజెక్టు విశేష కృషిచేస్తోందని, ఇందులో భాగంగా 8,600 మహిళ భక్తిమండలి గ్రూపులు ఏర్పాటు చేశామని దాస సాహిత్య ప్రాజెక్టు అధికారి ఆనందతీర్థాచార్యులు తెలిపారు. ఇందులో 4,500 గ్రూపులు యాక్టివ్‌గా పని చేస్తున్నాయన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరు విచ్చేసిన ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. దక్షిణ భారతదేశంలో దాస సాహిత్యం ప్రాచుర్యం పొందిందన్నారు. పురందరదాసు 4.75 లక్షల సంకీర్తనలు రచించారని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి 46ఏళ్ల క్రితం టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఏర్పాటు చేసిందన్నారు. పురందరదాసు కీర్తనల సారాంశాన్ని వివరించి మండలి గ్రూపులకు నేర్పిస్తామని వివరించారు. కోలాటం ద్వారా కూడా సంకీర్తనలు ఆలపించే విధంగా నేర్పిస్తున్నట్టు చెప్పారు. గుమ్మిలేరులో ఈనెల 6, 7 తేదీల్లో శిక్షణ ఇచ్చామన్నారు. దాస సాహిత్య ప్రాజెక్టుకు తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా ఈ ఏడాది రూ.2.30 కోట్లు బడ్జెట్ కేటాయించారని పీవో ఆనందతీర్థాచార్యులు తెలిపారు. ప్రాజెక్టుకు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు బడ్జెట్ పెంచితే దక్షిణ భారతదేశంలో ప్రచారం చేయడానికి వీలుకలుగుతుందన్నారు. గ్రూపులకు పలు ఆధ్యాత్మిక క్షేత్రాల్లో వర్క్‌షాపులు నిర్వహిస్తున్నట్టు వివరించారు. విలేకరుల సమావేశంలో దాస సాహిత్య ప్రాచుర్యకర్త పి.ముకుందేశ్వరస్వామి పాల్గొన్నారు.

సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి
రూ.లక్ష విరాళం



పీఆర్వో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, జూన్ 7: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం కాతేరుకు చెందిన జి.వెంకట సత్యనారాయణ రూ.1,00,001లు విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని దాత పీఆర్వో కృష్ణారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శనం కల్పించారు.

ఘనం చండీహోమం

రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్ర జపములు పఠించారు. 11 గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళం



దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ సిబ్బంది

మామిడికుదురు, జూన్ 7: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన నేదునూరి శేషగిరి-బేబీఅన్నపూర్ణ దంపతులు శుక్రవారం రూ.1,00,116 విరాళం అందించారు. తమ పెళ్లిరోజైన డిసెంబరు 9న ప్రతి సంవత్సరం అన్నదానం జరిపించాలని కోరారు. దాత దంపతులకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటంతో పాటు ప్రసాదాలు అందించి అభినందించారు.

డెల్టా కాలువలకు
6 వేల క్యూసెక్కుల నీరు విడుదల

ధవళేశ్వరం, జూన్7: కాటన్ బ్యారేజ్ నుంచి మూడు డెల్టా కాలువలకు శుక్రవారం 6వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టా ప్రధాన పంట కాలువకు 1000 క్యూసెక్కులు, మధ్యడెల్టా ప్రధాన పంట కాలువకు 1000 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా ప్రధాన పంట కాలువకు 4000 క్యూసెక్కులు చొప్పున సాగునీరు విడుదల అవుతుంది. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 10.65 అడుగులుగా నమోదుకాగా 3141 క్యూసెక్కుల మిగులు జలాలు బ్యారేజ్ నుంచి దిగువకు ప్రవహిస్తున్నాయి.

వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించిన జేడీ విజయ

జీజీహెచ్ (కాకినాడ) జూన్ 7: కాకినాడ జీజీహెచ్ ప్రాంగణంలో మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుపుతున్న సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను రాష్ట్ర మహిళా స్కీమ్స్ జాయింట్ డైరెక్టర్ (జేడీ) కె.విజయ శుక్రవారం సందర్శించి అక్కడ రికార్డులను పరిశీలించి బాధితుల వివరాలను తెలుసుకుని వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. రాష్ట్రంలోని మహిళలకు సంబంధించిన అన్ని ఇన్‌స్టిట్యూషన్స్ పని తీరును పరిశీలిన నిమిత్తం ఆమె శుక్రవారం జీజీహెచ్‌లోని వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించారు. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది పనిలో నిబద్ధత కలిగి బాధితులకు అండగా ఉంటూ వారికి శారీరకంగా, మానసికంగా ఏర్పడిన బాధకు శాంత్వన చేకూర్చి వైద్య చికిత్స విషయంలో వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.ప్రవీణ, వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఆర్.శైలజ పాల్గొన్నారు.

పంపా రిజర్వాయర్ గేట్ల పనితీరుపై ఆందోళన

● పరిశీలించిన ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు

అన్నవరం, జూన్ 7: మెట్టప్రాంత రైతుల వరప్రదాయిని అయిన పంపా రిజర్వాయిర్ గేట్ల పనితీరుపై ఆందోళన వ్యక్తం అవుతుంది. గత ప్రభుత్వ హయాంలో మరమ్మతులకు నిధులు విడుదల చేయకపోవడంతో తాత్కాలిక పనులు చేపట్టి గట్టెక్కించారు. వర్షాకాలం ప్రారంభం కానుండడంతో గేట్ల పరిస్థితిపై శుక్రవారం ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ సతీష్‌కుమార్, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు, ఈఈ శేషగిరి తదితరులు పరిశీలించారు. ప్రధానంగా నాల్గవ నంబరు వరదగేటు గతంలో ఇబ్బంది పెట్టడంతో గేట్ల ఆపరేటింగ్ చేయించి పరిశీలించారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీరు లేకపోవడంతో సులువుగా పైకి కిందకు దిగినా రిజర్వాయర్ నిండితే గేట్లు పైకి లెగడం, కిందకు దిగడం వంటి పరిస్థితులు ఉత్పన్నమవుతాయని సిబ్బంది సూచించారు. రెండ్రోజుల్లో మరోసారి పరిశీలించి అత్యవసరంగా ఉన్న పనులకు నిధులు మంజూరు చేయించి అనంతరం శాశ్వత పనులు చేపడతామని ఈఎన్‌సీ సతీష్‌కుమార్ తెలిపారు. ఇటీవల మరమ్మతులు చేపట్టిన పంటకాలువ గేట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారిణి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



పంపా గేట్లను పరిశీలిస్తున్న ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ తదితరులు

కొనసాగుతున్న
జీర్ణోద్ధారణ పనులు

ఈనెల 17 వరకూ స్వామి దర్శనాలు నిలుపుదల



సామర్లకోట కుమార రామ భీమేశ్వరుడు

సామర్లకోట, జూన్ 7: పంచారామ పుణ్యక్షేత్రమైన కాకినాడ జిల్లా సామర్లకోట కుమారరామ భీమేశ్వరాల యంలో శివలింగానికి జరుగుతున్న జీర్ణోద్ధారణ పనులు ఇంకా నిర్వహించాల్సి ఉన్నందున శివలింగ దర్శనాలు ఈనెల 16వరకూ నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం తెలిపారు. శివలింగ జీర్ణోద్ధారణ పనులు భారతీయ పురావస్తుశాఖ ఆధ్వర్యంలో గతనెల 28 నుంచీ నిర్వహిస్తున్న విషయం విధితమే. ముందుగా ప్రకటించిన మేరకు ఈనెల 8 వరకూ శివలింగ దర్శనా లు నిలిపివేసిన విసయం విధితమే. నిర్ధేశించిన మేరకు పనులు పూర్తికానందున 16వరకూ నిర్వహించనున్నందున సంప్రోక్షణ చర్య లు పూర్తిచేసి ఈనెల 17న సోమవారం ఏకాదశి నుంచి గర్భాలయం పునఃర్దర్శనం భక్తులకు ఏర్పాటుచేస్తామని ఈవో తెలిపారు. భక్తులు గమనించి దేవదాయ, భారతీయ పురావస్తుశాఖల అధికారులు చేస్తున్న పనులకు సహకరించాలని ఈవో నీలకంఠం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబా బు, వెంకన్న, అంజిబాబు, శ్రీనివాసరావు, వినయ్ పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

● రూ. 5 లక్షల విలువ గల 3,500 కిలోల బియ్యం, వాహనం పట్టివేత

సామర్లకోట, జూన్ 7: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం ఉండూరు- వీకె.రాయపురం రోడ్డులో ఏపీ 39 యూసీ 2589 అనే మినీ వ్యాన్ వాహనంలో 3,500 కిలోల పరిమాణంలో 70 మూటలుగా కట్టి అక్రమంగా తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించి సీజ్ చేశారు. రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు పంపిణీ చేసే రేషన్ బియ్యంగా వీటిని నిర్ధారించి అక్రమ తరలింపునకు పాల్పడిన పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడుకు చెందిన బొజ్జా మణికంఠపై 6ఏ చట్టం కింద, క్రిమినల్ కేసులు నమోదు చేయగా అక్రమ తరలింపు వ్యవహారంలో అనుమానితులుగా ఉన్న వారిపైనా కేసులు నమోదు చేశామని విజిలెన్స్ అధికారులు చెప్పారు. అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని సామర్లకోట ఎంఎస్వోకు అప్పగించి వాహనాన్ని సామర్లకోట పోలీసులకు అప్పగించామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఈ దాడులలో విజిలెన్స్ అధికారులు జగన్నాదరెడ్డి, నవీన్‌కుమార్, జీవానందం, వీరబాబు, సీఎస్‌డీటి కీర్తితో బాటూ రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.



అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

విద్యుదాఘాతంతో ఐదు గేదెలు మృతి

● రూ.5 లక్షల వరకు ఆస్తినష్టం

ఎటపాక, జూన్ 7: వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏర్పాటుచేసిన ఎర్త్ పైపువైరు తగిలి ఐదు గేదెలు మృతి చెందిన సంఘటన శుక్రవారం పురు షోత్తపట్నం పంచాయతీలోని కొల్లుగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. కొల్లుగూడెం గ్రామంలోని గార్లపాటి శాంతారావు, గార్లపాటి రామారావు, గార్లపాటి శ్రీపతి రైతులకు చెందిన నాలుగు గేదెలు, ఒక దూడ మేతకోసం గ్రామశివారులోని వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ సమీపం వద్దకు వెళ్లాయి. ఈక్రమంలో నెలపై ఉన్న ట్రాన్స్ ఫార్మర్ ఎర్త్ పైపు వైరు తగిలి నాలుగు గేదెలు, ఒక దూడ అక్కడికక్కడే మృతి చెందాయి. మృతి చెందిన గేదెల విలువ రూ.5లక్షల వరకు ఉంటుందని బాధిత రైతులు పేర్కొన్నారు. వెటర్నరీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, మృతి చెందిన గేదెలకు పంచనామా నిర్వహించారు.



విద్యుదాఘాతంతో మృతి చెందిన గేదెలు

రంపచోడవరంలో
227 పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ హవా

● ఏడు మండలాల్లో టీడీపీ, నాలుగు మండలాల్లో వైసీపీ

(రంపచోడవరం)

రంపచోడవరం ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గంలో మూడు ఎన్నికల అనంతరం తెలుగుదేశంపార్టీకి విజయాన్ని కట్టబెట్టిన ఇక్కడి ఓటర్లు ఇక్కడున్న మొత్తం 11 మండలాల్లో ఏడు మండలాలు తెలుగుదేశంవైపు నిలవగా, నాలుగు మండలాలు వైసీపీ వైపు నిలిచాయి. ఈ 11 మండలాల్లో ఉన్న మొత్తం 398 పోలింగ్ కేంద్రాలలో ప్రధాన పార్టీలకు వచ్చిన ఓట్లను పరిశీలిస్తే రంపచోడవరం, దేవీపట్నం, గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజఒమ్మంగి, కూనవరం, వి.ఆర్.పురం మండలాలు తెలుగుదేశానికి అండగా నిలిచాయి. ఎటపాక, చింతూరు, మారేడుమిల్లి, వై.రామవరం మండలాలు మాత్రం వైసీపీ పక్షాన నిలిచాయి. అంటే పూర్వపు రంపచోడవరం ఏడు మండలాలలో ఐదు మండలాలు టీడీపీకి, నాలుగు విలీన మండలాలలో రెండు మండలాలు వైసీపీకి దక్కాయి. అనధికార సమాచారం ప్రకారం పోలింగ్ కేంద్రాలలో టీడీపీ, వైసీపీ పార్టీలకు దక్కిన ఓట్లను మండలాల వారీగా విభజిస్తే తెలుగుదేశానికి వచ్చిన 9,015 ఓట్ల మెజారిటీ రంపచోడవరం, దేవీపట్నం, గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజఒమ్మంగి, కూనవరం, వి.ఆర్.పురం మండలాల నుంచే దక్కింది. ఇక 398 పోలింగ్ కేంద్రాలలో 228 కేంద్రాలలో టీడీపీ తన ఆధిక్యతను కనబర్చింది.

సర్పంచ్‌కు తెలియకుండా నిధులు విత్‌డ్రా....?

● 15వ ఆర్థిక సంఘం నిధుల్లో గోల్‌మాల్ ?

రాజమహేంద్రవరంరూరల్, జూన్ 7: నిన్నటి వరకు గత ప్రభుత్వానికి కొమ్ముకాసిన పంచాయతీ అధికారులు నేడు మరలా పెత్తనం చెలాయించడానికి, అదే గ్రామాల్లో కొనసాగేందుకు ఇప్పటి నుంచే పైరవీలు మొదలుపెట్టారు. కడియం మండలంలో గ్రేడ్-3 మహిళా కార్యదర్శులు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న గ్రామాల్లో అవినీతికి పాల్పడుతున్నారని పలువురు బాహాటంగా చెబుతున్నారు. బిల్డింగ్ ప్లాన్‌కి సంబంధించి గృహనిర్మాణదారుడు పంచాయతీకి తగిన రుసుము చెల్లించాల్సి ఉంటుంది. గృహనిర్మాణదారుడు చెల్లించిన రుసుములో కొంతమాత్రం సొమ్ముకు చెల్లని రశీదు ఇచ్చి మిగతా సొమ్ములను పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆరోపిస్తున్నారు. మమ్మల్ని ఎవర్రా ఆపేది అంటూ ఇన్నాళ్లుగా మండలస్థాయి రాజకీయ నాయకులను అధికారులను అడ్డుపెట్టుకుని ఇష్టానుసారంగా వ్యవహరించారని ఆరోపణలు లేకపోలేదు. ఎం-బుక్‌లు, బిల్లులపై సర్పంచ్ సంతకం కూడా లేకుండా ఎటువంటి పనులు చేయని వాటికి కూడా అంతా తామై డీఎస్ విధానాన్ని(డిజిటల్ సైన్) అడ్డుపెట్టుకుని పంచాయతీకి సంబంధించి 15వ ఆర్థికసంఘం నిధులు అవకతవకలు పాల్పడినట్లు స్వాహా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై జిల్లాస్థాయి అధికారులు లోతుగా పరిశీలించి సమగ్ర నివేదిక తయారుచేసి పంచాయతీకి రావాల్సిన నిధులను సమకూర్చి సంబంధిత గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులను చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



నిధులు విత్‌డ్రాకు సంబంధించిన వివరాలు



మధురపూడి ఎయిర్‌పోర్టు వద్ద హీరో రామ్‌చరణ్‌కు స్వాగతం పలుకుతున్న అభిమానులు

బొబ్బర్లంక-రావులపాలెం మార్గంలో
ట్రాఫిక్ మళ్లింపు

● సినీ హీరో షూటింగ్ నిమిత్తం నేడు, రేపు ట్రాఫిక్ ఆంక్షలు

ఆత్రేయపురం, జూన్ 7: ప్రముఖ సినీ హీరో షూటిం గ్ నిమిత్తం మండలంలోని బొబ్బర్లంక-రావులపాలెం ఆర్ అండ్‌బీ రహదారిలో ఈ నెల 8, 9 తేదీల్లో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్టు రావులపాలెం సీఐ ఎం.రామ్‌కుమార్ తెలిపా రు. బొబ్బర్లంక నుంచి రావులపాలెం వైపు వెళ్లే నాలుగు చక్రాల వాహనాలు, భారీ వాహనాలు, కార్లు, లారీలు, బస్సులు, ట్రాక్టర్లు ధవళేశ్వరం బ్యారేజీని దాటుకుని వేమగిరి, జొన్నాడ మీదుగా రావులపాలెం చేరుకోవాలన్నారు. వాడపల్లి ఆలయానికి ద్విచక్ర వాహనాల్లో వెళ్లవచ్చన్నారు. రావులపాలెం హైవే, వేమగిరి మీదుగా బొబ్బర్లంక చేరుకోవాలన్నారు. ద్విచక్రవాహనచోదకులు బొబ్బర్లంక-రావులపాలెం రహదారి మీదుగా రాకపోకలు సాగించవచ్చని సీఐ చెప్పారు.

గేమ్ చేంజర్ సినిమా సందడి

ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక పరిసర ప్రాంతాలలో హీరో రామ్‌చరణ్ నటిస్తున్న గేమ్ చేంజర్ సినిమా షూటింగ్ సన్నివేశాలు రెండు రోజులపాటు చిత్రీకరించనున్నారు. ఈ షూటింగ్ సన్నివేశాలకు సంబంధించిన ఏర్పాట్లు చురుగ్గా నిర్వహిస్తున్నారు. అలాగే షూటింగ్ నిమిత్తం హీరో రామ్‌చరణ్ శుక్రవారం రాత్రి రాజమహేంద్రవరంలోని మధురపూడి ఎయిర్‌పోర్టుకు నుంచి బయలుదేరి షెల్టాన్ హోటల్‌కు చేరుకున్నారు.

రేపు పిఠాపురంలో
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ పోటీలు

పిఠాపురం, జూన్ 7: కాకినాడ జిల్లా పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈనెల 9న మధ్యాహ్నం ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ఆర్చరీ పోటీలు జరుగుతాయని ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేఎన్ఎస్ గోపాలకృష్ణ, పి.లక్ష్మణరావులు తెలిపారు. పోటీలు అండర్ 10, 13,15 ఏజ్ గ్రూపుల్లో ఇండియన్, రికార్వ్, కాంపౌండ్ విభాగాల్లో జరుగుతాయని చెప్పారు. అండర్ 10 విభాగంలో పాల్గొనే వారు 2015 జనవరి 1 తర్వాత జన్మించిన వారు, అండర్-13లో 2012 జనవరి 1 తర్వాత, అండర్-15లో 2010 జనవరి 1 తర్వాత పుట్టిన వారు అర్హులని వివరించారు. పోటీల్లో పాల్గొనే వారు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వారై ఉండి, ఆధార్‌కార్డు జిరాక్స్, పుట్టినరోజు ధ్రువీకరణపత్రం జిరాక్స్‌లు తీసుకురావాలని తెలిపారు. వివరాలు కోసం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మణరావును సెల్: 9989001162లో సంప్రదించాలని సూచించారు.

మధ్యవర్తిత్వ తర్ఫీదు శిక్షణ ముగింపు

● ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వ తర్ఫీదు శిక్షణ శుక్రవారంతో ముగిసిందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత అన్నారు. ఈనెల 3న మధ్యవర్తిత్వ తర్ఫీదు శిక్షణ ప్రారంభించారు. ఢిల్లీ నుంచి వచ్చిన సీనియర్ శిక్షకులు వినయ్‌కుమార్ గుప్తా, సునీల్‌కుమార్ అగర్వాల్ ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన 30 మంది న్యాయాధికారులకు 40గంటల పాటు తర్ఫీదు ఇచ్చారు. ఈ శిక్షణలో నేర్పించిన మెలకువలవల్ల మధ్యవర్తిత్వంలో న్యాయాధికా రులకు మంచి నైపుణ్యం లభించిందని భావిస్తున్నామన్నారు. అనంతరం వినయ్‌కుమార్ గుప్తా, సునీల్‌కుమార్ అగర్వాల్‌ని పీడీజే సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్ మృతి

గొల్లప్రోలు రూరల్, జూన్ 7: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కంటైనర్ డ్రైవర్ చికిత్స పొందుతూ మరణించాడు. ఒడిస్సా రాష్ట్రంలోని మహిమాడిపూర్ సమీపంలోని జగత్‌సింగ్‌పూర్ దున్‌షాహి ప్రాంతానికి చెందిన డిబకర్ దాస్ కాకినాడలోని బీ 1కంపెనీలో కంటైనర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాకినాడ జిల్లా తాళ్లరేవు నుంచి రొయ్యలలోడు వేసుకుని భువనేశ్వర్ వెళ్లిన దాస్ అన్‌లోడింగ్ తర్వాత తిరిగి ప్రయాణమయ్యాడు. గొల్లప్రోలు మండలం చేబ్రోలువద్దకు వచ్చేసరికి శుక్రవారం ఉదయం 5గంటల సమయంలో ముందు వాహనం బ్రేక్ వేయడంతో తప్పించబోయి ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో దాస్‌కు తీవ్రగాయాలు కాగా కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించాడు. గొల్లప్రోలు ఎస్‌ఐ బాలాజీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొని
దంపతులకు తీవ్ర గాయాలు

ప్రత్తిపాడు, జూన్ 7: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో దంపతులతో పాటు మరో వ్యక్తి గాయపడ్డారు. అన్నవరం నుంచి రాజమహేంద్రవరం బైక్‌పై వెళుతున్న రాజమహేంద్రవరానికి చెందిన దంపతులు ధర్మవరం కోల్డ్ స్టోరేజ్‌వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఈ దంపతులను స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం కాకినాడకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే ప్రత్తిపాడుకు చెందిన మరో వ్యక్తి స్కూటీపై రాచపల్లి వెళుతుండగా మినర్వా కళాశాల సమీపంలోని సుద్దగడ్డ వాగు దిగువున అదుపు తప్పి రహదారిపై పడిపోవడంతో తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్‌లో స్థానిక ఆసుపత్రికి తరలించారు.



తీవ్రగాయాలైన దంపతులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

ఏజెన్సీ సమాచారం

ఎమ్మెల్యే శిరీషకు అభినందనలు


ఎమ్మెల్యే శిరీషను అభినందిస్తున్న వై.రామవరం మండల నాయకులు

వై.రామవరం, జూన్ 7: రంపచోడవరం నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యేగా విజయదుంధుబీ సాధించిన మిరియాల శిరీషదేవిను శుక్రవారం వై.రామవరం మండలం టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి ఆమెకు అభినందనలు తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు పల్లాల వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శిరీషకు పూలదండలువేసి స్వీట్లు తినిపించారు. మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిరిబాల సామయ్య కుప్ప శ్రీను, మహిళా నాయకురాలు మడకం రామలక్ష్మి, రావడి పుష్పరాజు, పల్లాల కృష్ణారెడ్డి, వెలుగూరి విశ్వరెడ్డి, దుర్గాప్రసాద్, సాంబ, పండురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌పురంలో విజయోత్సవ సంబరాలు


శ్రీరామగిరిలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నాయకులు

వరరామచంద్రాపురం, జూన్7: మండలంలో ఎన్డీఏ కూటమి గెలుపు నేపథ్యంలో శుక్రవారం జనసేన, టీడీపీ, బీజేపీ మండల నాయకులు కార్య కర్తలు శ్రీరామగిరి గ్రామంలో విజయోత్సవ సంబరాలు జరుపుకున్నా రు. జనసేన మండల అధ్యక్షుడు మలకాల సాయికృష్ణ ఆధ్వర్యంలో శ్రీరామగిరి, చొక్కనపల్లి, సీతంపేట గ్రామాలలో కూటమి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడు కోట్ల ఆంధ్రుల విజయమే ఎన్డీఏ కూటమి గెలుపన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.



అడ్డతీగల: రాష్ట్రంలో టీడీపీ అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంతో అడ్డతీగల మండలంలో టీడీపీ శ్రేణులు శుక్రవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. రంపచోడవరం నియోజకవర్గంలో ఏన్డీఏ కూటమి నేతలు అడ్డతీగలలో భారీ ర్యాలీ నిర్వహించి స్థానిక దేవీ సెంటర్‌లో బాణా సంచా కాల్చారు.



ఎటపాక: రాష్ట్రంలో ఏన్డీఏ కూటమి ఘన విజయం సాధించిన నేపథ్యంలో శుక్రవారం నెల్లిపాక గ్రామంలో కూటమి నాయకులు విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. గ్రామ ప్రధాన సెంటర్ నుంచి శివారు ప్రాంతం వరకు, కేరింత లు, ఆనందోత్సవాల నడుమ ర్యాలీని నిర్వహించారు. రాష్ట్రంలో అరాచకపాలన అంతమై, ప్రజాపాలన వచ్చిందని టీడీపీ నాయకుల నలజాల శ్రీకాంత్, ఏలూరి వెంకన్న అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రామకృష్ణ, వీర్ల శ్రీకాంత్, ఠాగూర్, రాము, నిషాంత్, నలజాల వెంకటేశ్వరరావు, శ్యామ్ పాల్గొన్నారు.

దేవీపట్నం: మండలంలోని చొప్పకొండలో మాజీ సర్పంచ్ కోండ్ల బొజ్జిరెడ్డి ఆధ్వర్యంలో కూటమి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అఖండ మెజార్టీతో విజయం సాధించినందుకు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ముచ్చి త్రిమూర్తులు, ప్రధాన కార్యదర్శి మెహర్‌బాబాగౌడ్, నగేష్, లంక హరిశ్చంద్రుడు, గేదల పెద్దసుబ్బారావు, మన్నేపల్లి కనకం, శ్రీనివాసరెడ్డి, పెద్దనూతులు చౌదరి, చినసుబ్బారావు, సత్యంరాజు, పోసిరెడ్డి, ఇల్ల సత్యనారాయణరెడ్డి, కత్తుల పండురెడ్డి, ఈతపల్లి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి రాజులస్వామి, పెద్ద, చిన్నసార్లమ్మజాతర

వరరామచంద్రాపురం, జూన్ 7: శనివారం నుంచి రేఖపల్లిలోని నాయకపోడు గిరిజనుల ఆరాధ్య దైవమైన రాజులస్వామి, పెద్దసార్లమ్మ, చిన్నసార్లమ్మ దేవతా మూర్తుల జాతర నిర్వహిస్తున్నట్లు పూజారి సార పాండురాజు తెలిపారు. ఈ జాతర మహోత్సవాన్ని ప్రతిమూడేళ్ల కొకసారి నిర్వహిస్తామన్నారు. ఈజాతర 11 రోజులపాటు జరుగుతుందన్నారు. ఈ 11 రోజులు దేవారుల నడుమ స్వామివార్ల జాతరను వైభవంగా జరుపుతామని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకోవాలని కోరారు.

కానిస్టేబుల్‌కు బెస్ట్ ఫీల్డ్ స్టాఫ్ రోలింగ్ ట్రోఫీ అవార్డు



కమిషనర్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న కానిస్టేబుల్ రమణ

రంపచోడవరం, జూన్ 7: రంపచోడవరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న బి.వి.రమణకు బెస్ట్ ఫీల్డ్ స్టాఫ్ రోలింగ్ ట్రోఫీ అవార్డు దక్కింది. ఎస్ఈబీ కమిషనర్ నుంచి శుక్రవారం అవార్డును అందుకున్నారు. రమణకు అవార్డు రావడంపై స్టేషన్ సీఐ ఇంద్రజిత్ హర్షం తెలిపారు.

వై.రామవరం నుంచి కాకినాడకు రోజూ నాలుగు బస్సులు

వై.రామవరం, జూన్ 7: అల్లూరి జిల్లా వై.రామవరం నుంచి అడ్డతీగల, ఏలేశ్వరం, జగ్గంపేట, సామర్లకోట మీదుగా కాకినాడకు డైరెక్ట్‌గా వెళ్లేందుకు ప్రతీ రోజూ నాలుగు ఆర్టీసీ బస్సు సర్వీసులు ఏర్పాటుచేసినట్లు ఏలేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ జీవీ సత్యనారాయణ తెలిపారు. ఏజెన్సీ ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన ఈ బస్సు సర్వీసును శుక్రవారం ప్రారంభించామన్నారు. వై.రామవరం నుంచి కాకినాడ వెళ్లేందుకు ఉదయం 7.30, 9.30గంటలకు, మధ్యాహ్నం 12.45, 2.45 గంటలకు బస్సు సర్వీసు ఉందన్నారు. కాకినాడ నుంచి వచ్చేందుకు ఉదయం 7.45, 9.45, మధ్యాహ్నం 12.30, 2.30 సమయాల్లో బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. మిగిలిన సర్వీసులు యథావిధిగా వై.రామవరం నుంచి ఏలేశ్వరం వరకు సర్వీసులు నడుపుతామన్నారు.

రేపు ప్రత్యేక వైద్యశిబిరం

రంపచోడవరం, జూన్ 7: రామకృష్ణమిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం సిరిగిందలపాడులో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రామకృష్ణమిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనంద తెలిపారు. గుండెకు సంబంధించిన వ్యాధులు, ఆయాసం, దడ, బీపీ, షుగరు, చెవి, ముక్కు, గొంతు, ఎముకలు, కీళ్లు, ఫిట్స్, చర్మ వ్యాధులతోపాటు స్త్రీలు, పిల్లల వ్యాధులకు వైద్య నిపుణులతో వైద్యసేవలు అందిస్తారన్నారు. వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం వారిచే కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. వైద్యశిబిరానికొ వచ్చేవారు ఆధార్, రేషను కార్డులను తీసుకురావాలని సూచించారు.

దోమల నియంత్రణకు ఫాగింగ్

మోతుగూడెం, జూన్ 7: చింతూరు మండలం మోతుగూడెంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి రవినాయక్, సర్పంచ్ ఆకేటి సతీ దగ్గరుండి మోతుగూడెం గ్రామంలో ఫాగింగ్ చేయించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి రవినాయక్ మాట్లాడుతూ దోమల ద్వారా ప్రభలే వ్యాధులను అదుపులో ఉంచేందుకు ముందస్తు చర్యలో భాగంగా దోమల మందును స్ప్రే చేస్తున్నామని తెలిపారు.


విత్తనాలకు గొడౌన్ కేటాయింపు

రాజవొమ్మంగి, జూన్ 7: ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైన 'విత్తనాలు దించేందుకు గొడౌన్ ఏదీ..?' అంటూ వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. రాజవొమ్మంగిలో దాదాపు నిర్మాణం పూర్తయిన రాజవొమ్మంగి సచివాలయం-2 భవనాన్ని తాత్కాలికంగా విత్తనాలు దించేందుకు కేటాయించారు. గతవారం రాజవొమ్మంగి సమీప గ్రామాల ప్రజలకు ప్రభుత్వ రాయితీతో ఇవ్వాల్సిన విత్తనాలు దించేందుకు రాజవొమ్మంగిలో గొడౌన్ లేక జడ్డంగి గ్రామంలో రాజవొమ్మంగిలో దించాల్సిన విత్తనాలు దించారు. జడ్డంగి గ్రామం నుంచి రాజవొమ్మంగి విత్తనాలు తెచ్చేందుకు సుమారు 20వేల రూపాయల ఖర్చు అవుతుందని, ఆ ఖర్చు అధికారులు పెట్టుకుంటారా..?, రైతులపైనే భారం వేస్తారా..? అనే దానిపై జడ్డంగిలో దించిన విత్తనాలను రాజవొమ్మంగి తెచ్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. శుక్రవారం విజయవాడ, విశాఖపట్నం నుంచి రాజవొమ్మంగి వచ్చిన విత్తనాలను సచివాలయ భవనంలో అధికారులు భద్రపరిచారు.

ముసలమ్మ తల్లిని దర్శించుకున్న శ్రీహరిరాజు

కడియం, జూన్ 7: రాష్ట్ర దేవాలయాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, సింహాచలం దేవస్థానం ఉద్యోగి శ్రీహరిరాజు శుక్రవారం కడియపులంక ముసలమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయకమిటీ అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. అలానే శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి సంపంగి మొక్కలు, గోశాలకు నీడనిచ్చే మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో రైతులు నక్కా ప్రసాద్, పంతం శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, పెద్దిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులకు శ్రీహరిరాజు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

పట్టణ ఓటరు ఇటే..



రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం మ్యాప్

- నగరంలో కూటమి సరికొత్త రికార్డు
- రాజమహేంద్రవరం 9వ డివిజన్‌లో అత్యధిక మెజార్టీ
- డివిజన్ల వారీగా పైచేయి సాధించిన అభ్యర్థి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 7: సార్వత్రిక ఎన్నికలు-2024 ఫలితాల్లో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలోని 42 డివిజన్లు కూటమికి అద్భుతమైన మెజార్టీని ఇచ్చాయి. ఆయా డివిజన్లలో టీడీపీ, జనసేన, బీజేపీ ఇన్‌చార్జ్‌లు, మాజీ కార్పొరేట్ల సమష్టి కృషి ఫలితంగా నగరంలో తొలిరౌండ్ నుంచి జయకేతనం ఎగురవేశారు. నగర పరిధిలోని 9వ డివిజన్‌లో 10,693 ఓట్లకు గాను కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు 4,973 ఓట్ల పడగా వైసీపీ అభ్యర్థి భరత్‌రామ్‌కు 1599 ఓట్లు, ఇతరులకు 261 ఓట్లు పడ్డాయి. 3374 ఓట్లతో ఈ డివిజన్ వాసు మెజార్టీలో ప్రథమ స్థానంలో వుంది. డివిజన్ల వారీగా మార్గాని భరత్‌పై వాసు మెజార్టీని కొనసాగిస్తూ పైచేయిగా నిలిచారు.

డివిజన్ల వారీగా కూటమి మెజార్టీ ఇదీ..

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలోని 42 డివిజన్లలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి సత్తాచాటారు. 1వ డివిజన్‌లో 2131 ఓట్ల మెజార్టీ, 2వ డివిజన్‌లో 2887, 3 వడివిజన్‌లో 1163, 4వ డివిజన్‌లో 1299, 5వడివిజన్‌లో 469, 6వ డివిజన్‌లో 1706 , 7వ డివిజన్‌లో 1092, 8వ డివిజన్‌లో 1435, 9వ డివిజన్‌లో 3374, 10వ డివిజన్‌లో 2199, 11వ డివిజన్‌లో 3139, 12వ డివిజన్‌లో 1906, 13వ డివిజన్‌లో 1043, 14వ డివిజన్‌లో 477, 15వ డివిజన్‌లో 841, 21వ డివిజన్‌లో 1738, 22వ డివిజన్‌లో 1936, 23వ డివిజన్‌లో 1285, 24వ డివిజన్‌లో 1948, 25వ డివిజన్‌లో 2230, 29వ డివిజన్‌లో 3065, 30వ డివిజన్‌లో 1418, 31 డివిజన్‌లో 1353, 32వ డివిజన్‌లో 786, 33వ డివిజన్‌లో 1234, 34వ డివిజన్‌లో 1020, 35వ డివిజన్‌లో 1331, 36వ డివిజన్‌లో 2283, 37వ డివిజన్‌లో 2358, 38వ డివిజన్‌లో 2044, 39వ డివిజన్‌లో 1991, 40వ డివిజన్‌లో 1838, 41వ డివిజన్‌లో 1575, 42వ డివిజన్‌లో 2089, 43వ డివిజన్‌లో 1734, 44వ డివిజన్‌లో 1205 ఓట్లు, 45వ డివిజన్‌లో 1014, 46వ డివిజన్‌లో 2251, 47వ డివిజన్‌లో 1010, 48వ డివిజన్‌లో 1149, 49వ డివిజన్‌లో 1274 ఓట్లు, 50వ డివిజన్‌లో 1391 ఓట్ల మెజార్టీ లభించింది. మొత్తం 71,404 ఓట్ల మెజార్టీని ఆదిరెడ్డి సాధించారు.

రాజమహేంద్రవరంలో సరికొత్త రికార్డు

రాజమహేంద్రవరం చరిత్రలో సరికొత్త రికార్డును టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి కైవసం చేసుకుంది. గతంలో ఇంత భారీ స్థాయిలో మెజార్టీని ఏ పార్టీ సాధించలేదు. 2014 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ ఆకుల సత్యనారాయణ తన సమీప ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి బొమ్మన రాజ్‌కుమార్‌పై 26,377 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అటుపై 2019 ఎన్నికల్లో ఆదిరెడ్డి భవాని టీడీపీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి రౌతు సూర్యప్రకాశరావుపై 30039 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. కాగా ఇప్పటి వరకు రాజమహేంద్రవరంలో అసెంబ్లీకి పోటీ చేసిన అభ్యర్థులు సుమారు 40,000 లోపు ఓట్ల మెజార్టీతోనే విజయం సాధించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ తన సమీప ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి మార్గాని భరత్‌రామ్‌పై 71,404 ఓట్లు మెజార్టీతో అఖండ విజయాన్ని కైవసం చేసుకున్నారు.

మూడు నెలల్లో ఫ్లయ్ ఓవర్‌ను ప్రారంభిస్తాం


మోరంపూడి ఫ్లయ్ ఓవర్‌ను పరిశీలిస్తున్న ఆదిరెడ్డి వాసు

మోరంపూడి ఫ్లయ్ ఓవర్ పరిశీలనలో ఎమ్మెల్యే విజేత ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 7: మోరంపూడి ఫ్లయ్ ఓవర్ మరొక మూడు నెలల్లో పూర్తవుతుందని అప్పుడు దీనిని ప్రారంభిస్తామని రాజమహేంద్రవరం కూటమి ఎమ్మెల్యే విజేత ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులతో కలిసి శుక్రవారం మోరంపూడి ఫ్లయ్ ఓవర్‌ను పరిశీలించి మాట్లాడారు. రాజమహేంద్రవరం ఎంపీగా మురళీమోహన్ ఉన్నప్పుడు 2014-19 మధ్యలో 4 ఫ్లయ్ ఓవర్లు తీసుకొచ్చారని చెప్పారు. భరత్ రామ్ చేతకాని తనం వల్ల అవి వెనక్కిపోయాయని చెప్పారు. పైగా మోరంపూడి ఫ్లయ్ ఓవర్ ఏదో అతనే తీసుకువచ్చినట్టు సిగ్గులేకుండా చెప్పుకున్నాడని ధ్వజమెత్తారు. ఫ్లయ్ ఓవర్‌ను మురళీమోహన్ తీసుకువస్తే ఆయన పేరును ఏనాడు పలకలేదన్నారు. వైసీసీ హయాంలో మోరంపూడి పనులు ప్రారంభించడానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వచ్చినప్పుడు పంపిన ఆహ్వానంలో గత కొనసాగింపు పనిగా చూపించారని గుర్తుచేశారు. ఫ్లయ్ ఓవర్‌ను కాంట్రాక్టరును అడిగామని మరొక మూడునెలల్లో పనులు పూర్తవుతాయని చెప్పారన్నారు. ఎంపీ పురందేశ్వరి, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి దీనిని పరిశీలిస్తారన్నారు. మోరంపూడి సెంటర్‌లో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని టీడీపీ శ్రేణులు కూల్చివేశారు. గతంలో ఎంపీ మురళీ మోహన్ వేసిన శిలాఫలకాలను వైసీపీ ప్రజాప్రతినిధులు కూల్చివేశారు. అప్పటి నుంచి ఆవేదనలో ఉన్న టీడీపీ శ్రేణులు శుక్రవారం ఉదయం మోరంపూడి సెంటర్‌లో వైసీపీ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని బద్దలుకొట్టారు. కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీనివాస్, టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు, బుడ్డిగ రాధా, మజ్జి రాంబాబు, దాస్యం ప్రసాద్, చాపల చిన్నరాజు, మరుకుర్తి రవియాదవ్, వాసిరెడ్డి బాబీ, మాజీ కార్పొరేటర్లు మొకమాటి సత్యనారాయణ, సింహా నాగమణి, జనసేన నాయకులు ఆసూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విధ్వంసకర దాడులు మా సంస్కృతి కాదు..

రాజమహేంద్రవరం మోరంపూడి వద్ద జరిగిన శిలాఫలకం కూల్చివేత ఘటనపై ఎమ్మెల్యే విజేత ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పందించారు. తమ వాళ్లది ఆవేదన అని తప్పుచేయాలనే ఉద్దేశం కాదన్నారు. రాజమహేంద్రవరం తిలక్ రోడ్డులోని ఎన్నికల కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. విధ్వంసాలు, దాడులు చేయడం తమ సంస్కృతి కాదన్నారు. సమావేశంలో జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు, మజ్జి రాంబాబు, కిలపర్తి శ్రీనివాస్, బుడ్డిగ రవి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తా

- అనపర్తి ఎమ్మెల్యే విజేత నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, జూన్ 7: నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానని అనపర్తి ఎమ్మెల్యే విజేత నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తానని, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. తన గెలుపుకు అహర్నిశలు కృషిచేసిన బీజేపీ, టీడీపీ, జనసేన కార్యకర్తలకు రుణపడి ఉంటానన్నారు. కాగా విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని సందర్శించేందుకు వెళ్లిన రామకృష్ణారెడ్డికి ఆ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలి కారు. మిఠాయిలు తినిపించి, సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.మధుకర్‌ను నల్లమిల్లి సత్కరించారు. కార్యక్రమాల్లో రాష్ట్ర నాయకులు బిట్ర శివనారాయణ, స్టేట్ స్పోకస్ పర్సన్ లంక దినాకర్, యామిని శర్మ, సోమినాయుడు, జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, భగవాన్, బాల తమలంపూడి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నల్లమిల్లి

ప్రదాని మోదీ ప్రమాణ స్వీకారానికి నల్లమిల్లికి ఆహ్వానం

ఈనెల 9న ఢిల్లీలో జరిగే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారానికి కేంద్ర కార్యాలయం నుంచి ఆహ్వానం అందినట్టు రామకృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు ఢిల్లీ పయనమౌతున్నట్టు చెప్పారు.

కనకదుర్గమ్మను దర్శించుకున్న నల్లమిల్లి దంపతులు

విజయవాడలోని ఇంద్రకీలాద్రిలో కనకదుర్గమ్మను శుక్రవారం నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం వారికి వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆయన తెలిపారు.



నారా లోకేశ్‌ను కలిసిన రామకృష్ణారెడ్డి

మంగళగిరి ఎమ్మెల్యేగా విజయం సాధించిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను శుక్రవారం విజయవాడలో కలుసుకున్న ఎమ్మెల్యే విజేత నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇద్దరూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్ని కొద్దిసేపు ముచ్చటించుకున్నారు.

ఎంపీ విజేత పురందేశ్వరిని కలిసిన బత్తుల


పురందేశ్వరి దంపతులను సత్కరిస్తున్న బత్తుల

కోరుకొండ, జూన్ 7: రాజమహేంద్రవరం కూటమి ఎంపీ విజేత దగ్గుబాటి పురందేశ్వరి, వెంకటేశ్వరరావును దంపతులను రాజానగరం ఎమ్మెల్యే విజేత బత్తుల బలరామకృష్ణ, వెంకటలక్ష్మి దంపతులు శుక్రవారం కలిశారు. పుష్పగుచ్చం ఇచ్చి అభినందనలు తెలిపారు. గజమాలతో సత్కరించారు. అనంతరం వారితో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా బత్తులకు వెంకటేశ్వరరావు కొన్ని పుస్తకాలు బహుమతిగా ఇచ్చారు.

బత్తులను కలిసిన ముద్రగడ కుమార్తె

ఎమ్మెల్యే విజేత బత్తుల బలరామకృష్ణను మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం కుమార్తె పార్లపూడి క్రాంతి శుక్రవారం సాయంత్రం ఆయన నివాసంలో కలిశారు. పుష్పగుచ్చం ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె బత్తుల కుటుంబ సభ్యులతో గడిపారు. కార్యక్రమంలో తోట ప్రత్యూషదేవి, బత్తుల వందనాంబిక తదితరులు పాల్గొన్నారు.

యనమలను కలిసిన బీవీఆర్ చౌదరి

రాజానగరం, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించిన సందర్భంగా టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడిని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి శుక్రవారం విజయవాడలోని అతిథి గృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యనమలకు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. బీవీఆర్ వెంట నాయకులు తనకాల నాగేశ్వరరావు తదితరులున్నారు. అలాగే ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలుపొందిన బత్తుల బలరామకృష్ణను రాజానగరం మండల వీఆర్వోల అసోసియేషన్ బత్తుల స్వగృహంలో కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ మండలాధ్యక్షుడు జాన్, కార్యదర్శి సానా శ్రీను. కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బత్తులను కలిసి శుభాకాంక్షలు

మొక్కు తీర్చుకున్న ఇళ్లపల్లి శ్రీధర్ యూత్

బిక్కవోలు, జూన్ 7: ఎమ్మెల్యేగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తే విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకుంటామని ఇళ్లపల్లి శ్రీధర్ యూత్ మొక్కుకున్నారు. దీంతో తనుకు శ్రీధర్ ఆధ్వర్యంలో గురువారం కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అనంతరం విజయవాడ బీజేపీ కార్యాలయంలో వున్న రామకృష్ణారెడ్డిని కలసి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీధర్ వెంట నీలపాల మణికుమార్, నక్కా వెంకటేష్, కటిమేని బాలు, తనుకు లోవరాజు, స్వామి, గణేష్, సురేష్, మణికంఠ తదితరులున్నారు.

సీతానగరం ఆర్బీకే చైర్మన్ పదవికి రాజీనామా

సీతానగరం, జూన్ 7: గత ప్రభుత్వంలో నామినేటెడ్ పోస్టులు పొందిన వైసీపీ నాయకులు రాజీనామాల బాటపడుతున్నారు. ముందుగా మండల రైతు భరోసా చైర్మన్ వలవల వెంకట్రాజు(తోటలో రాజు) తన పదవికి రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. వైసీపీ ఘోర పరాజయం, జక్కంపూడి రాజా ఓటమిని జీర్ణించుకోలేక తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు

ప్రభుత్వ కళాశాల వైపు తల్లిదండ్రుల మొగ్గు

బిక్కవోలు, జూన్ 7: బిక్కవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాల వైపు విద్యార్థుల తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారని పాఠశాల హెచ్ఎం పీవీ ప్రభాకరరావు గురువారం తెలిపారు. ఈ ఏడాది తమ కళాశాలలో సీఈసీ, ఎంపీసీ గ్రూపులు ప్రారంభిస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ 20 మంది తల్లిదండ్రులు తమ పిల్లలను కళాశాలలో చేర్పించేందుకు అంగీకరించారన్నారు. తమ ఉపాధ్యాయులు జేఎస్ ప్రసాద్, ప్రసన్నకుమారి, రామలక్ష్మి, మమతలు ప్రతి రోజూ గ్రామంలో పర్యటించి విద్యార్థులు కళాశాలలో చేరేందుకు కృషి చేస్తున్నారన్నారు.

అనుమతుల్లేని ఇసుక ట్రాక్టర్ సీజ్

సీతానగరం, జూన్ 7: ఏ విధమైన అనుమతులు లేకుండా మండలంలోని సింగవరంలోని అనధికార ర్యాంపు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం అర్ధరాత్రి ఎస్ఐ టి.రామకృష్ణ పట్టుకుని సీజ్ చేశారు. సింగవరం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్థానికులు అడ్డుకుని ఎస్ఐకు సమాచారం ఇవ్వడంతో ట్రాక్టర్ సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. లంకూరుకు చెందిన ట్రాక్టరుగా గుర్తించారు. ఇందుకు సంబంధించిన రిపోర్టును స్థానిక తహశీల్దార్ బి.నెల్సన్ పాల్‌బాబుకు అందించారు. రిపోర్టును పరిశీలన అనంతరం చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ తెలిపారు.

ఎన్డీఏ పక్ష నేతగా మోదీ ఎన్నికపై హర్షం

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 7: ఎన్డీఏ పక్ష పార్లమెంట్ నేతగా నరేంద్రమోదీ ఏకగ్రీవంగా ఎన్నికవడం పట్ల బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ బాణసంచా కాల్చి ఆనందం పంచుకున్నారు. ఈ మేరకు శుక్రవారం రాజమండ్రి బీజేపీ కార్యాలయం వద్ద పలువురు నాయకులు మోదీ మూడో సారి ప్రధాని పదవి చేపడుతున్నందున శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రొంగల గోపి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడబాల రామకృష్ణారావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కురగంటి సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పన్నాల సంతోషి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావును కలిసిన ఎమ్మెల్యే శిరీష



కడియం, జూన్ 7: రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి శుక్రవారం వేమగిరి విచ్చేశారు. ఈ సందర్భంగా రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకుడు, టీడీపీ రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసేందుకు వచ్చినట్లు ఆమె తెలిపారు.

లోకేశ్‌ను కలిసిన యర్రా



రాజమహేంద్రవరం సిటీ, జూన్ 7: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాల రాయుడు మంగళగిరిలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

చట్ట పరిధిలో అందరూ సమానమే : డీఎస్పీ

రాజమహేంద్రవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): చట్ట పరిధిలో అందరూ సమానమనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సౌత్ జోన్ డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ హెచ్చరించారు. ప్రజలు సంయమనం కోల్పోవద్ద న్నారు. అనవసర ఆవేశాలు, ఉద్వేగాలతో హింస చెలరేగే విధంగా ప్రవర్తిం చవద్దన్నారు. రౌడీయిజం, దౌర్జన్యం ఎవరు చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశాంతంగా ఉండే ఈ ప్రాంతంలో మాటలు, చేతల ద్వారా అలజడి సృష్టిస్తే ఉపేక్షించేది లేదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా నడుచుకోవద్దని రెండో పట్టణ, ధవళేశ్వరం, కడియం పోలీస్ స్టేషన్ల పరిధిలోని వారికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

ఆహారంలో లోపాలుంటే కేసులు : రుక్కయ్య



ఆహార భద్రత దినోత్సవంపై సమావేశ దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 7: ఆహారంలో ఎటువంటి లోపాలు ఉన్నా కేసులు నమోదు చేస్తామని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వి.రుక్కయ్య అన్నారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం క్వారీ సెంటర్ రైతు బజార్‌లో శుక్రవారం ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం నిర్వహిం చారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏడీ ఎం.వినయ్ సునీల్, విజిలెన్స్ కమిటీ సభ్యులు ధర్నాలకోట వెంకటేశ్వరరావు, కెవి రమణ, అమరవాది రామకృష్ణ, రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్, రైతులు వ్యాపారులు, వినియోగదారులు పాల్గొన్నారు.

గోరంట్లను కలిసిన చినరాజప్ప



రాజమహేంద్రవరం రూరల్, జూన్ 7: రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యేగా భారీ విజయాన్ని కైవసం చేసుకున్న గోరంట్ల బుచ్చయ్యచౌదరిని పెద్దాపురం ఎమ్మెల్యేగా విజయం సాధించిన నిమ్మకాయల చినరాజప్ప శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను గోరంట్ల సత్కరించారు. అలాగే బుచ్చయ్య చౌదరిని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, అధికారులు, ప్రజలు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలతో సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీగా ప్రజలు తరలిరావడంతో ఆయన నివాసం కిక్కిరిసి సందడిగా మారింది.

నెహ్రూకు మంత్రి పదవి కోసం పాదయాత్ర



గోకవరం, జూన్7: జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు మంత్రి పదవి దక్కాలని ఆకాంకిస్తూ ఆయన అభిమాని విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం వరకు పాదయాత్ర చేపట్టాడు. మండలంలోని గంగంపాలెం మాజీ ఎంపీటీసీ సాలెపు నలమహరాజు.. ఎమ్మెల్యే నెహ్రూ అభిమాని. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయన గెలుపునకు కృషి చేశాడు. ఈ క్రమంలోనే నెహ్రూకు మంత్రి పదవి కూడా దక్కాలంటూ గంగంపాలెం నుంచి విజయవాడకు పాదయాత్రగా శుక్రవారం బయలుదేరాడు. ఆతడికి ఎమ్మెల్యే కోడలు లక్ష్మీదేవి, మనుమడు అనీష్ నెహ్రూసంఘీ భావం తెలిపారు. మంగరౌతు రాము, పాలూరి బోస్, కోట సత్యవతి, మండిగ గంగాధర్, బత్తుల ప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం



రంగంపేట, జూన్ 7: స్థానిక శాఖా గ్రంథాలయంలో 25 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం ముగిసింది. శిబిరంలో నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముందుగా గ్రంథాలయ ఉద్యమకారులైన అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్.ఆర్ రంగనాథన్ నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వజ్రపు వెంకటరమణ మాట్లాడుతూ పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. గ్రంథాలయాధికారి నల్లమిల్లి రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పీవీ సాయిప్రసాద్, ఎమ్.రామభద్రరావు, టి.శ్రీనివాస్, పలువురు పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలువలకు 6 వేల క్యూసెక్కులు విడుదల

ధవళేశ్వరం, జూన్7: కాటన్ బ్యారేజ్ నుంచి మూడు డెల్టా కాలువలకు శుక్రవారం 6 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టా ప్రధాన పంట కాలువకు 1000 క్యూసెక్కులు, మధ్యడెల్టా ప్రధాన పంట కాలువకు 1000 క్యూసెక్కులు, పశ్చిమడెల్టా ప్రధాన పంట కాలువకు 4000 క్యూసెక్కులు చొప్పున సాగునీరు విడుదల అవుతుంది. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 10.65 అడుగులుగా నమోదు కాగా 3141 క్యూసెక్కుల మిగులు జలాలు దిగువకు ప్రవహిస్తున్నాయి.

అమాత్యులు ఎవరో!




ఏడు నియోజకవర్గాల్లో అదృష్టవంతులెరో

- పురందేశ్వరికి కేంద్ర మంత్రి పదవి?
- రాష్ట్ర మంత్రి పదవులకు తీవ్ర పోటీ
- సీనియర్ కోటాలో గోరంట్లకు చాన్స్?
- ఎస్సీ కోటాలో మద్దిపాటికి దక్కేనా
- కందుల, బత్తుల ప్రయత్నాలు
- బీజేపీ కోటాలో నల్లమిల్లికి ఆశ
- మరో మూడు రోజుల్లో స్పష్టత

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గెలిచేశాం.. వాట్‌నెక్స్ట్.. ఇంకేముంది.. ఎలాగైనా మంత్రి వర్గంలో చోటు సంపాదించాలి.. ఇదీ నాయకుల ఆశ.. ఆ దిశగా ఎవరికి వారు ఇప్పటికే ప్రయత్నాలు ఆరంభించారు.. ఎవరు మంత్రి అవుతారు.. ఎవరు ఎమ్మెల్యేగా ఉంటారనేది త్వరలో తేలనుంది. ఎందుకంటే ఈ సారి మంత్రివర్గ కూర్పులో తీవ్ర పోటీ ఉంటుంది...ఈ సారి టీడీపీ,జనసే, బీజేపీ కూటమిగా ఏర్పడి బరిలో దిగాయి. 175 స్థానాలకు ఏకంగా 164 సీట్లలో విజయం సాధించాయి.ఈ నేపథ్యంలో ఎవరిని మంత్రి పదవి వరిస్తుందనే దానిపై అంచనాలు వేసుకుంటున్నారు. తెలుగుదేశం-జనసేన- బీజేపీ కూటమి అఖండ విజయం సాధించిన నేపథ్యంలో కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్‌డీఏ ప్రభుత్వాలు ఏర్పడనున్నాయి. రాష్ట్రంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఈ నెల 12వ తేదీన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ ఈ నెల 9వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్న సంగతి తెలిసిందే. జిల్లాలో కూటమి తరపున గెలిచిన అభ్యర్థుల్లో కొందరు మంత్రి పదవులను ఆశిస్తున్నారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ నుంచి అత్యధిక మెజార్టీతో గెలిచిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి కేంద్ర మంత్రి పదవి వచ్చే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతుంది.రాజమండ్రి లోక్‌సభ చరిత్రలో ఇంత వరకూ ఎవరికీ రానంత మెజార్టీ ఆమెకు లభించిన సంగతి తెలిసిందే.2014లో జరిగిన ఎన్నికల్లో మాగంటి మురళీ మోహన్‌కు 1,67,434 ఓట్ల మెజార్టీ లభించింది. ప్రస్తుతం పురందేశ్వరికి 2,39,139 ఓట్ల మెజార్టీ లభించింది.పైగా ఆమె ఎన్టీఆర్ కూతురు. పైగా ఆమె బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా కూడా ఉన్న సంగతి తెలిసిందే.ఈ పరిస్థితుల్లో ఆమెకు కేంద్ర మంత్రి పదవి వచ్చే అవకాశం ఉన్నట్టు విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. గతంలో ఒకసారి ఆమె కేంద్ర మంత్రి పదవిని నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆమెకు పదవి కచ్చితంగా వస్తుందనే వార్తలు వస్తున్నాయి. ఆదివారం ప్రధాని మోదీ ప్రమాణ స్వీకారం చేస్తున్నారు. కాబట్టి మంత్రి వర్గం కూడా అప్పుడే ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆమెకు మంత్రి పదవి వచ్చే అవకాశం ఉంటే శనివారం రాత్రిలోపు సమాచారం అందుతుంది. ప్రస్తుతం ఆమె ఢిల్లీలోనే ఉన్నారు. ఎన్డీఏ పక్షాల మీటింగ్ కోసం ఆమె వెళ్లారు. ఇక రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా కూటమి తరపున తెలుగుదేశం అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 12న ప్రమాణ స్వీకారం చేస్తున్నారు. అదే రోజు మంత్రి వర్గం కూడా ఏర్పడనుంది. జిల్లా నుంచి గెలిచిన వారంతా పదవులు ఆశిస్తున్నారు. ముఖ్యంగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సీనియర్ టీడీపీ నేత, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి మంత్రి పదవి వస్తుందనే ప్రచారం జరుగుతోంది. సామాజిక వర్గాల సమీకరణల నేపథ్యంలో పరిస్థితులు ఎలా ఉంటాయో చెప్పలేని స్థితి నెలకొంది. సీనియర్‌నేత కావడం వల్ల ఆయనకు మంత్రి పదవి ఇవ్వడం సబబనే వాదన ఉంది. ఇక ఎస్సీ కోటాలో గోపాలపురం నియోజక వర్గం నుంచి మంత్రి తానేటి వనితను ఓడించి విజేతగా నిలిచిన మద్దిపాటి వెంకట్రాజుకు కూడా మంత్రి పదవి వచ్చే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆయన జిల్లా మంత్రిని ఓడించడంతో పాటు, తెలుగుదేశం అధినేత చంద్రబాబు, నారా లోకేశ్‌కు బాగా సన్నిహితంగా ఉండే నాయకుడు. ఈ పరిస్థితుల్లో ఆయన పేరు మంత్రి పదవి కోటాలో బలంగా వినిపిస్తోంది. ఇక కొవ్వూరు ఎమ్మెల్యే విజేత ముప్పిడి వేంకటేశ్వరరావు, రాజ మండ్రి సిటీ నుంచి అత్యధిక మెజార్టీతో, విజేతగా నిలిచిన ఆదిరెడ్డి వాసు పదవి ఆశిస్తున్నారు. ఇక బీజేపీ కోటాలో తనకు అవకాశం ఉండొచ్చనే ఆలోచనలో అనపర్తి ఎమ్మెల్యే విజేత నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వర్గం భావిస్తోంది. పురం దేశ్వరికి కేంద్ర మంత్రి పదవి వస్తే ఆయన పేరు పరిశీలనలో ఉండకపోవచ్చు.ఇక మరో ముఖ్యమైన పార్టీ జనసేన. నిడదవోలు నుంచి కందుల దుర్గేష్, రాజానగరం నుంచి బత్తుల బలరామకృష్ణ గెలిచిన సంగతి తెలిసిందే. జనసేనలో కాపు కోటాలో ఒకరికి అవకాశం ఉండవొచ్చనే ప్రచారం జరుగుతోంది. కందుల దుర్గేష్ జనసేన సీనియర్‌నేత. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడిగా, జనసేనపొలిటికల్ ఎఫైర్స్‌కమిటీ సభ్యుడిగా ఉన్నారు. ఆయనకు ప్రాధాన్యత ఉండొచ్చనే ప్రచారం ఉంది. ఇక బత్తుల బలరామకృష్ణ కూడా తన ప్రయత్నాలు తాను చేస్తున్నట్టు తెలుస్తోంది. చివరకు తెలుగుదేశం, జనసేన, బీజేపీ మూడు పార్టీల అధినేతలు కూర్చుని, సామాజిక వర్గాలు,ప్రాంతాలు, సీనియార్టీ వంటివన్నీ పరిగణనలోకి తీసుకుని ఎవరికి మంత్రి పదవి ఇవ్వాలనేది నిర్ణయిస్తారు. రెండు మూడు రోజుల్లో ఎవరికి పదవనేది స్పష్టత రానున్నది.


గోరంట్ల



వీళ్లొద్దనే మాట.. అందరి నోటా!

- జిల్లాలో నోటాదే మూడో స్థానం
- ఐదు నియోజకవర్గాల్లో ఇంతే
- రాజమండ్రి రూరల్‌లో 4వ స్థానం
- ప్రభావం చూపని స్వతంత్రులు
- జిల్లాలో మొత్తం 71 మంది అభ్యర్థులు
- ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్యే పోటీ
- కాంగ్రెస్‌కు అంతంతమాత్రమే ఓట్లు
- రాజానగరంలో ఏడు బ్యాలెట్ ఓట్లు
- లోక్‌సభ బరిలో 24 వేల ఓట్లు

రసవత్తరంగా జరిగిన సాధారణ ఎన్నికల్లో అందరి నోటా ఒకటే మాట.. ప్రతి నియోజక వర్గం లోనూ వేలాది మంది వీళొద్దనే చెప్పారు.. తమకు ఏ అభ్యర్థీ నచ్చలేదని తీర్పునిచ్చారు. ఎందుకంటే జిల్లాలో మొత్తం 83 మంది అభ్యర్థులు అటు లోక్‌సభ.. ఇటు అసెంబ్లీ స్థానాల నుంచి పోటీపడ్డారు. వీరిలో ప్రధాన పార్టీలైన టీడీపీ/జనసేన / బీజేపీ కూటమి, వైసీపీ అభ్యర్థుల మధ్యే పోరు జరిగింది. ఏ నియోజకవర్గంలో చూసినా మూడో స్థానం మాత్రం నోటా కే దక్కింది.ఏడు నియోజకవర్గాల్లోనూ పరిస్థితి ఇలాగే ఉంది. స్వతంత్ర అభ్యర్థుల శక్తి నోటా కన్నా తక్కువగా ఉంది. ఎన్నికల తంతు మొదలైనప్పటి నుంచి ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్రుల హడావిడి కూడా ఎక్కువైంది. తీరా కౌంటింగ్ చూస్తే నోటా కన్నా తక్కువగా ఓట్లు రావడంతో స్వతంత్రులంతా తెల్లమొహం వేశారు.

గోపాలపురం 4500 ఓట్లు..

గోపాలపురం, జూన్ 7 : గోపాలపురం నియోజకవర్గంలో 10 మంది అభ్యర్థులు పోటీలో ఉంటే వారిలో ఆరుగురు స్వతంత్రులు, కాంగ్రెస్ అభ్యరి ఒకరు,బీఎస్పీ అభ్యర్థి ఒకరున్నారు. వారిలో పట్టుమని 200 ఓట్లు రాని వారు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీపడ్డారు. ఏ ఎన్నికైనా ప్రజల్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ గుర్తు కీలకమనేది సుస్పష్టం. ఎందరూ పోటీలో ఉన్నా ప్రధాన పార్టీల అభ్యర్థులకే ఓట్లు వేస్తారు. అధికార, ప్రతిపక్ష పార్టీ లకు ఓట్లు వేయకపోతే చివరికి నోటాకి నొక్కేస్తారు. స్వతంత్రులను కనీసం పరిగణనలోకి తీసుకోవడంలేదు. గోపాలపురంలో ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులకు పోలైన ఓట్ల కంటే నోటాకు పోలైన ఓట్లే ఎక్కువ. ఇదిలా ఉంటే పోస్టల్ బ్యాలెట్ ఓటు ఒకటంటే ఒక్కటైన స్వతంత్రులకు దక్కలేదు. నియోజకవర్గంలో స్వతంత్రులకు పోలైన ఓట్ల వివరాలు ఇలా ఉన్నాయి.పెనుమాక వెంకట రత్నంకు పోలైన ఓట్లు 342, బాతుల వేణుకు పోలైన ఓట్లు 206, శ్రీనివాసరావు ములగాలకు పోలైన ఓట్లు 166, దొడ్డిగర్ల నాగార్జునకు పోలైన ఓట్లు 168, ముక్కవల్లి వెంకట రమణకు పోలైన ఓట్లు 271, రాపాక హరీష్‌కుమార్‌కు పోలైన ఓట్లు 528 ఉన్నాయి. స్వతంత్రుల్లో ఒకరికి గరిష్ఠంగా 528 ఓట్లు పడగా మరొకరికి కనిష్ఠంగా 166 ఓట్లు మాత్రమే దక్కాయి. ప్రధాన పార్టీలకే నియోజ కవర్గ ఓటర్లు మొగ్గు చూపారని స్వతం త్రులను పరిగణన లోకి తీసుకోలేదని తేటతెల్లమైంది. ఇదిలా ఉండగా నోటాకు పోలైన ఓట్లు 4488, పోస్టల్ బ్యాలెట్ - 12, మొత్తం 4500.

కొవ్వూరులో 2465 ఓట్లు..

కొవ్వూరు, జూన్ 7 : సార్వత్రిక ఎన్నికల్లో కొవ్వూరు నియోజకవర్గంలో నోటా మూడో స్థానంలో నిలిచింది. కొవ్వూరు నియోజకవర్గం నుంచి ఇటీవల జరిగిన ఎన్నికలలో 11 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. కూటమి అభ్యర్థి, వైసీపీ, కాంగ్రెస్ పార్టీలతో పాటు మరో 8 మంది బరిలో నిలిచారు. కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావుకు 92,743, వైసీపీ అభ్యర్థి తలారి వెంకట్రావుకు 58,797 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి అరిగెల అరుణకుమారికి 1897 ఓట్లు,నోటాకు 2465 ఓట్లు,స్వతంత్రులు మిగిలిన 8 మందికి కలిపి 3209 ఓట్లు పడ్డాయి. అంటే ఇక్కడ కూడా నోటాదే మూడో స్థానం.

నిడదవోలులో 2137 ఓట్లు..

నిడదవోలు, జూన్ 7 : నిడదవోలు నియోజకవర్గంలో నోటాదే మూడో స్థానం. నిడదవోలు నియోజకవర్గంలో 13 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ప్రధాన పార్టీలైన తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి, వైసీపీ అభ్యర్థుల మధ్య ప్రధాన పోటీ నెలకొంది. అయితే స్వతంత్రులు, ఇతర పార్టీల నాయకులు 11 మంది ఉన్నా ఎవరూ అంతగా ప్రభావం చూపలేదు. దీంతో మూడో స్థానం నోటాకే దక్కింది. స్వతంత్ర అభ్యర్థులు కొట్టియాడ దుర్గకు 454 ఓట్లు, అరిగెల సత్య వరప్రసాద్‌కు 478 ఓట్లు, వెంకటేశ్వరనాయుడు గిద్దాకు 347 ఓట్లు, శ్రీనివాస్‌నాయుడు గిద్దాకు 283 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి పెద్దిరెడ్డి సుబ్బారావుకు 1495 ఓట్లు, పిరమిడ్ పార్టీ అభ్యర్థి ముక్కామల అన్నవర ప్రసాద్‌కు 278 ఓట్లు, జై భారత్ పార్టీ అభ్యర్థి పులమాల వీరభద్రంకు 311 ఓట్లు రాగా ఒక్క నోటాకే 2137 ఓట్లు వచ్చాయి. అంటే ఇక్కడ కూడా నోటాదే పైచేయిగా నిలిచింది.

రాజమండ్రి రూరల్ 2699

కడియం, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం నుంచి 8 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ప్రధానంగా కూటమి అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, వైసీపీ అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణల మధ్య పోటీ నెలకొంది.ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరికి 1,29,060 ఓట్లు,వైసీపీ అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు 64,970 ఓట్లు వచ్చాయి. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (ఐఎన్‌సీ) అభ్యర్థి బాలేపల్లి మురళీధర్‌కు 2,728 ఓట్లతో తృతీయ స్థానం, నాలుగో స్థానంలో నోటాకు 2,699 ఓట్లు పోలయ్యాయి. బీఎస్పీ అభ్యర్థి కొండపల్లి సూరిబాబుకు 1,217 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి చింతలపాటి పవన్‌కుమార్‌కు 714 ఓట్లు, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థి దుగ్గిరాల శ్రీదేవికి 360 ఓట్లు, జైభారత్ నేషనల్ పార్టీ మన్నవ రఘురామ్‌కు 310 ఓట్లు పడ్డాయి. ఈ నియోజకవర్గంలో నోటాకు నాల్గవ స్థానం దక్కడం విశేషం.

అనపర్తిలో 3093..

అనపర్తి, జూన్ 7 : అనపర్తి నియోజకవర్గ ఎన్నికల్లో బీజేపీ, వైసీపీ, కాంగ్రెస్ పార్టీలతో సహా తొమ్మిది మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. వీరిలో ఏడుగురు వివిధ పార్టీలకు చెందిన వారు కాగా ఇరువురు స్వతంత్ర అభ్యర్థులుగా రంగంలోకి దిగారు. బీజేపీ అభ్యర్థికి 1,04,705 ఓట్లు రాగా సమీప వైసీపీ అభ్యర్థికి 84,138 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీకి 1276 ఓట్లు రాగా ఇతరులకు 1750 ఓట్లు వచ్చాయి. నోటాకు మాత్రం 3093 ఓట్లు పడ్డాయి. ఇక్కడ ప్రధాన అభ్యర్థుల మినహా కాంగ్రెస్ సహా ఏడుగురు అభ్యర్థులకు 3026 ఓట్లు నోటాకు 3093 ఓట్లు వచ్చాయి. దీంతో ఏడుగురు అభ్యర్థులపైనా నోటాదే పైచేయిగా ఉంది.

రాజానగరంలో 2975 ఓట్లు

దివాన్‌చెరువు/ రాజానగరం : సార్వత్రిక ఎన్నికల్లో రాజానగరం నియోజకవర్గంలో నోటాకు మూడోస్థానం దక్కడం గమనార్హం. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాజానగరం నియోజకవర్గం నుంచి 12 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. వీరిలో టీడీపీ, బీజేపీ,జనసేన కూటమి అభ్యర్థిగా పోటీచేసిన బత్తుల బలరామకృష్ణకు 1,05,995 ఓట్లు, వైసీపీ అభ్యర్థి జక్కంపూడిరాజాకు 71,946 ఓట్లు లభించాయి.కూటమి అభ్యర్థి బత్తుల 34,049 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. మూడో స్థానంలో నోటాకు ఓట్లు ఎక్కువ పడ్డాయి. నోటాకు 2968 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా మరో ఏడు ఓట్లు వెర 2975 ఓట్లు లభించాయి. ప్రధాన రాజకీయ పార్టీ కాంగ్రెస్ అభ్యర్థి ముండ్రు వెంకట శ్రీనివాస్(పెదబాబు)1901 ఓట్లు సాధించారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూడా రాజానగరం నియోజకవర్గంలో నోటాకు 2200 ఓట్లు వచ్చాయి. ఆ ఎన్నికల్లో నోటా నాలుగో స్థానంలో నిలవడం గమనార్హం.

24 వేల మంది నోట నోటా..

రాజమహేంద్రవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఈసారి ఎన్నికల్లో నోటా కూడా ప్రధాన అభ్యర్థిగా నిలిచింది. రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలో స్వతంత్ర అభ్యర్థులు నోటా ముందు నీరు మూసుకోక తప్పలేదు. ఏ నియోజకవర్గంలో చూసినా స్వతంత్ర అభ్యర్థుల కంటే ఎక్కువగా నోటాకు ప్రజలు ఓటేశారు. అనపర్తిలో 3453, రాజానగరం 4077, రాజమండ్రి సిటీ 1992,రూరల్ 2938, కొవ్వూరు 3012, నిడదవోలు 2782, గోపాలపురం నియోజకవర్గంలో 6048 కలిపి మొత్తం 24302 మంది నోటాను ఎంచుకున్నారు. స్వతంత్ర అభ్యర్థుల్లో గణేశ్వరరావు పరమటకు 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో అధికంగా 20277 ఓట్లు పడగా.. ఆ సంఖ్య కంటే నోటాకు 4158 ఓట్లు అధికంగా పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్లలో కూడా 133 నోటాకు వేశారు. పార్లమెంట్ సెగ్మెంట్‌లోని మొత్తం ఓటర్లలో 1.80% నోటాకు ఓటేశారు.



చుక్కలో.. నొక్కు డెంత!



ఐదేళ్లుగా క్యాష్ పెట్టు..బాటిల్ పట్టు

- అంతంతమాత్రంగా డిజిటల్ లావాదేవీలు
- కోర్టు చెప్పినా బేఖాతర్
- ఎందుకనేది జగన్‌కెరుక
- ఎన్నికల షెడ్యూల్ వచ్చాక అమలు
- ఉన్నతాధికారులపై ఒత్తిడి
- గత నెలలో రూ.6 కోట్లు డిజిటల్
- చివరిలో ఆన్‌లైన్‌పై అనుమానం
- బ్లాక్ మనీగా లెక్కలేస్తున్న జనం
- వెల్లువెత్తుతున్న ఆరోపణలు
- కొత్త ప్రభుత్వం ఏం చేస్తుందో మరి?

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు క్యాష్ పెట్టు.. బాటిల్ పట్టు అనే విధంగా మద్యం వ్యాపారం సాగింది. వందల కోట్ల లావాదేవీలు నగదు రూపంలో జరిగేవి. స్వైపింగ్ లేదు..ఆన్‌లైన్ పేమెంట్లు పనిచేయలేదు.. స్కానర్లు మూలనపడ్డాయి.. కేంద్రం చెప్పినా, న్యాయస్థానాలు మొట్టికాయలు వేసినా జగన్ ప్రభుత్వం బేఖాతరు చేసింది. అధికారం చివరలో మాత్రం డిజిటల్ పేమెంట్లపై (స్వైపింగ్ /స్కానింగ్) రూపంలోనే చేయాలని మౌఖిక ఆదేశాలు జారీ చేయడంతో మందుబాబులు నివ్వెరపోయారు. మే 25వ తేదీ నుంచి డిజిటల్ చెల్లింపుల విధానాన్ని హఠాత్తుగా అమల్లోకి తెచ్చారు. మూలన పడిన స్వైపింగ్ మిషన్లకు దుమ్ము దులిపారు. ఈ నిర్ణయాన్ని రహస్యంగా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది. డిజిటల్ పేమెంట్ల విధానం తెచ్చిన నాటి నుంచీ ఈ ఏడాది మే నెలలో తొలిసారిగా ఏకంగా రూ.6 కోట్ల డిజిటల్ పేమెంట్లు నమోదయ్యాయి. డిజిటల్‌పై ఇన్నాళ్లూ లేని 'దృష్టి' పాలకులు చివరిలో సారించడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. గత ఐదేళ్లుగా డిజిటల్ పేమెంట్లు ఎందుకు చేయ లేదని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నల్లధనం నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుంటే అందుకు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మద్యం దుకాణాల్లో డిజిటల్ లావా దేవీలు తీసుకురావాలని ఎన్నిసార్లు జగన్ సర్కారుకు కేంద్రం లేఖలు రాసినా ఫలితం లేకుండా పోయింది. డబ్బు మూటలకే ఆయన ప్రాధాన్యమిచ్చారు.దీంతో కోట్లా ది రూపాయల నల్లధనం అవినీతి దందాలకు తరలిపోయింది. ఐదేళ్లుగా ఈ విధానం యథేచ్ఛగా జరిగింది.

మే 12న హడావుడిగా..

మే(గత నెల) 13న పోలింగ్ జరిగింది. ఆ రోజు సోమవారం. ముందు రోజు ఆదివారం అయినప్పటికీ బ్యాంకులను పని చేయించారు. ఎందుకంటే కేవలం ప్రభుత్వ మద్యం దుకాణాల అమ్మకాలను జమ చేయించడానికి బ్యాంకులను తెరిపించారు. మరి అప్పటి వరకూ ఆ సొమ్ము ఎక్కడకు వెళ్లేదనే ప్రశ్న జగన్ సర్కారునే అడగాలి. ఆ రోజున తిలక్‌రోడ్డులోని ఓ బ్యాంకు బ్రాంచిలో సుమారు రూ.5 కోట్ల వరకూ జమ అయ్యాయి. ఒక ప్రభుత్వ మద్యం దుకాణంలోని సిబ్బంది చేతివాటం ప్రద ర్శిస్తే సుమారు రూ.8 లక్షలను బ్యాంకు సమయం మించిపోయిన తర్వాత కూడా ఎక్సైజు/ ఎస్‌ఈబీ అధికా రులు బ్యాంకు సిబ్బంది కాళ్లావేళ్లాపడి ప్రభుత్వ ఖాతాలో జమ చేశారని సమాచారం.

ధరలను పెంచేసి.. తాగించేసి..

మద్యాన్ని దశలవారీగా నిషేధిస్తామంటూ ప్రగల్భాలు పలికిన జగన్ తర్వాత జనాలతో పూటుగా తాగించడం మొదలు పెట్టారు. పండుగలు తదితర ప్రత్యేక దినాల్లో మద్యాన్ని ఏరులైపారించారు. ధరలను విపరీతంగా పెంచేసి మందుబాబుల జేబులకు వేల కోట్ల రూపాయల చిల్లు పెట్టారు. అంత భారీ మొత్తంలో నగదు లావాదేవీలు ఏ కంపెనీ చేసినా ఎన్‌ఫోర్సుమెంటు ఏజెన్సీలు రంగంలోకి దిగేవి. కానీ సర్కారు వారి కంపెనీ కాబట్టి కిక్కురుమనలేదు. డిజిటల్ పేమెంట్లపై న్యాయస్థానాలు సీరియస్ అయితే వెంటనే నాలుగైదు రోజులు హడావుడి చేసేవారు. తర్వాత డిజిటల్ పేమెంట్ల విషయంలో సాంకేతికంగా వంకలు పెట్టేవారు. ఎస్‌బీఐ, పేటీఎం గేట్‌వేల ద్వారా ఆన్‌లైన్ విధానాన్ని జిల్లాలో గతేడాది తీసుకొచ్చారు. దీనిలోనూ మెలికలు పెట్టారు. పేటీఎం ద్వారా క్రెడిట్ కార్డులు పనిచేయవు. ఎవరైనా మందుసీసా కొంటే దానిపై ఉండే బార్‌కోడ్‌ని స్కాన్ చేస్తారు. కంప్యూటర్ స్క్రీన్‌పై డిజిటల్, క్యాష్ అనే ఆప్షన్లు కనిపించేవి. డిజిటల్ అని కొట్టగానే పేమెంటు పూర్తయ్యేది. ఒక్కోసారి ప్రాసెస్‌లో ఉండిపోయేది. చాలా సేపటి వరకూ క్లియర్ కాకపోతే ఇబ్బందులు తలెత్తేవి. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ వినియోగించే విశిష్ట యాప్‌లోనూ లోపాలు ఉండేవి. వీటన్నిటినీ ఏదో సరిచేయలేని సమస్యల్లా పట్టించుకునేవాళ్లు కాదు. పైకి డిజిటల్ అని హంగులు చూపిస్తూ నగదు లావాదేవీలను ప్రోత్సహించేవాళ్లు. వందల కోట్ల రూపాయల లావాదేవీలు నగదు రూపంలో జరగడంతో డబ్బు మూటలు వెనకేసుకోవడంలో ఇబ్బంది ఉండేది కాదు. అందుకనే డిజిటల్ లావాదేవీలను ఐదేళ్ల పాటూ ప్రోత్సహించలేదనే విమర్శలున్నాయి. వైసీపీ నాయకులు ఎన్నికల్లో వరదలా పారించిన డబ్బులు కూడా ఆ లావాదేవీల బాపతేనని తెలుస్తోంది.

నెలకూ రూ.100 కోట్ల అమ్మకాలు..

జిల్లాలోని మద్యం అమ్మకాలు ఈ ప్రభుత్వం వచ్చాక నెలకూ రూ.100 కోట్లకు చేరాయి. సుమారు 150 మద్యం దుకాణాలు, 20 బార్‌ల ద్వారా ఆదాయం సమకూరేది. బార్‌లలో ఎక్కువ బ్రాండ్లు లభ్యమైతే.. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో వాళ్లు ఇచ్చినవే కొనుక్కోవాల్సిన పరిస్థితి ఉండేది. అయితే ఎక్కడ కొన్నా అవన్నీ 'జే' బ్రాండ్లే. బెల్టుషాపులకు కొదువ ఉండేదికాదు. వాటికి ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచే మద్యం చాటుమాటుగా సరఫరా అయ్యేది. ఇలా మద్య నిషేధమన్న జగన్ మందుబాబులతో మద్యాన్ని పూటుగా తాగించారు. అయితే ఆ సొమ్ముల్లో చాలా మటుకు బ్లాక్‌మనీగా మారిపోయి ఉంటుందని జనం ఆరోపిస్తున్నారు. ఐదేళ్ల లెక్క తీస్తే అసలు విషయం బయటపడుతుందని అనడం గమనార్హం. దీనిపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలంటున్నారు.

ఏడాది అమ్మకాల్లో డిజిటల్ లావాదేవీలివీ..

నెల	మ.అ(కోట్లలో)	డి.పే(కోట్లలో)	శాతం
మే	90.30	1.40	1.55
జూన్	86.60	2.30	2.60
జూలై	85.20	3.20	3.70
ఆగస్టు	80.80	4.10	5.00
సెప్టెంబరు	76.50	4.40	5.50
అక్టోబరు	77.57	3.70	4.60
నవంబరు	75.30	3.80	4.80
డిసెంబరు	84.20	1.10	1.30
(2024)			
జనవరి	99.40	0.25	0.25
ఫిబ్రవరి	78.00	0.10	0.78
మార్చి	83.00	0.69	0.57
ఏప్రిల్	80.00	2.00	1.60
మే	80.00	6.00	5.00

మ.అ అంటే మద్యం అమ్మకాలు..
డి.పే అంటే డిజిటల్ పేమెంట్లు

ఏటిగట్లు తనిఖీ చేసి నివేదిక ఇవ్వండి

అధికారులతో సమీక్షించిన కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం, జూన్7(ఆంధ్రజ్యోతి) : రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని తుఫాన్‌లు, వరదలు వంటి ప్రకృతి విపత్తులను ఎదుర్కొనడానికి అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా.కె.మాధవీలత ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం ఇరిగేషన్, అగ్నిమాపక, వ్యవసాయం, మత్స్య శాఖ, గ్రామీణ నీటిపారుదల శాఖ, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్, మునిసిపాల్టీలు, విద్యుత్, వైద్యఆరోగ్యశాఖ, డివిజన్ మండల స్థాయి అధికారులతో వరదలు, భారీ వర్షాల విపత్తులపై సమీక్షించారు. గతంలో గోదావరి నదికి వచ్చిన వరదలను దృష్టిలో ఉంచుకుని గోదావరి పరీవాహక ప్రాంతపు గట్లను తనిఖీ చేసి నివేదిక అందించాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో మైనర్ ఇరిగేషన్ పరిధిలోని ఉన్న 530 చెరువులను రెవెన్యూ,ఇరిగేషన్ అధికారులు తనిఖీలు చేసి మరమ్మతులు చేయాలన్నారు. వరద ప్రమాదాల నివారణకు ఇసుక బస్తాలు సిద్ధం చేయాలని చెప్పారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పీహెచ్‌సీల్లో మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. శానిటేషన్ నిర్వహణ వ్యవస్థ పట్ల మునిసిపల్, పంచాయతీ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి రోజూ పరిశుభ్రమైన తాగునీటిని ప్రజలకు అందించాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖ అధికారులు రైతు లను దృష్టిలో ఉంచుకుని అధిక వర్షాల వల్ల పంటలకు ఏవిధమైన నష్టం సంభవించకుండా ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా పనులు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా బలహీనమైన వంతెనలు, కల్వర్టులు, ముందుగానే గుర్తించి వాటికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు.మిచౌంగ్ తుపాన్ కారణంగా కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో బురద కాలువకు 8 గండ్లు పడ్డాయని.. వాటి మరమ్మతుల రూ.25 లక్షలు ఖర్చవుతుందని ఇప్పటికే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని ఇరిగేషన్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆమె స్పందిస్తూ తక్షణం ఆయా పనులు చేపట్టాలని నిధులు మంజూరు చేస్తామన్నారు.వెంకటనగరం, తొర్రిగడ్డ, చాగల్నాడు లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతు పనులు చేపట్టి ఆయకట్టుకు సాగునీరందించే విధంగా సిద్ధంగా ఉండాలన్నారు. రాజమహేంద్రవరం నగరంలో లోతట్టు ప్రాంతాలు ముంపు బారిన పడకుండా నగర పాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టాలని చెప్పారు. ఆవ డ్రైన్ సమస్యపై తహశీల్దార్, డీపీవో డ్రెయిన్లను తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎస్.మాధవరావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి డి.బాలశంకరరావు, మత్స్య శాఖ జిల్లా అధికారి వి.కృష్ణారావు, డీపీవో డి.రాంబాబు, నగర పాలక సంస్థ ఎస్‌ఈ జి.పాండురంగారావు,అగ్నిమాపక అధికారి ఎం.మార్టిన్ లూథర్ కింగ్,ఆర్‌అండ్‌బీ ఈఈ మదుసూధనరావు, ఇరిగేషన్ ఎస్‌ఈ ఎ.శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, రామకృష్ణ, డీఈ ఈ రమేష్‌బాబు,ఏఈలు ఆర్.సునీల్‌బాబు. ఎ.శివ తదితరులు పాల్గొన్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఎంపీ పురందేశ్వరిని కలిసిన ఎమ్మెల్యే ముప్పిడి



ఎంపీ పురందేశ్వరిని అభినందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, ద్విసభ్య కమిటీ

కొవ్వూరు, జూన్ 7: రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం రాజమహేంద్రవరంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధి కేంద్రం తరపున సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మద్దిపట్ల శివరామకృష్ణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, పొట్రు శ్రీనివాసరావు, కొప్పాక విజయకుమార్, మారిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన కుందుల, విక్రమాదిత్య





పెరవలి/తాళ్లపూడి, జూన్ 7: టీడీపీ నిడదవోలు నియోజకవర్గ నాయకుడు కుందుల వీరవెంకట సత్యనారాయణ, తాళ్లపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన అల్లూరి విక్రమాదిత్య, యువగళం సభ్యులు టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని ఆయన నివాసంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రం పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని కుందుల ఆశాభావం వ్యక్తం చేశారు. లోకేశ్‌ను కలిసిన వారిలో కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణేష్ ఉన్నారు.

ఎమ్మెల్యే శిరీషదేవికి జవహర్ సత్కారం



ఎమ్మెల్యే శిరీషదేవిని సత్కరిస్తున్న జవహర్

కొవ్వూరు, జూన్ 7: రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే ఎం.శిరీషదేవి శుక్రవారం కొవ్వూరులో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జవహర్ పుష్పగుచ్ఛం అందించి సత్కరించి అభినందించారు.

నెలాఖరులోపు ట్యాక్స్ రిటర్న్స్ చెల్లించాలి

కొవ్వూరు, జూన్ 7: రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారులు ఈ నెల 30వ తేదీ లోగా ట్యాక్స్ రిటర్న్స్ చెల్లించాలని ఆ సంఘం కొవ్వూరు అధ్యక్షుడు ఎం.రామచంద్రరావు తెలిపారు. కొవ్వూరు సబ్ ట్రెజరీ ద్వారా పింఛను పొందుతూ ఇన్‌కమ్ ట్యాక్స్ పరిధిలో ఉండి ట్యాక్స్ చెల్లించిన పింఛనుదారులుందరికీ ట్రెజరీ కార్యాలయం ద్వారా ఫారం-16 అందజేస్తున్నారన్నారు. పన్ను చెల్లిందారులంతా జూన్ 30వ తేదీలోగా రిటర్న్స్ చెల్లించాలన్నారు.

నాగసాయి మందిరంలో వార్షికోత్సవ పూజలు



నిడదవోలు, జూన్ 7: మండలంలోని తాడిమళ్లలో నాగసాయి మందిరం 18వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం బాబాకు పంచామృత సుగంధ ద్రవ్య విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేష పూజలు, ఆధ్యాత్మిక భజనలు, అన్నప్రసాదాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయిబాబాను దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో ట్రస్ట్ సభ్యులు మధు, సుబ్రహ్మణ్యం, తాడిమళ్ల శ్రీను తదితర్లు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా కార్యదర్శి పదవికి రాజీనామా



మద్దిపాటి ఫణీంద్ర

నిడదవోలు, జూన్ 7: వైసీపీ జిల్లా కార్యదర్శి పదవికి, పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు మద్దిపాటి ఫణీంద్ర తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు, తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయానికి లేఖ రాసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్‌పార్టీలో పలు హోదాల్లో పనిచేశానని, వైఎస్సార్ మరణానంతరం వైసీపీలో చేరానని, పార్టీ సీనియర్ నాయకుడిగా తనకు కనీస మర్యాద ఇవ్వడం లేదన్నారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, అతడి అనుచరగణం 'నేనే రాజు నేనే మంత్రి' అనే రీతిలో వ్యవహరిస్తున్నారని, వారి విధానాలతో ఏకీభవించలేక మనస్తాపంతో రాజీనామా చేస్తున్నానని పేర్కొన్నారు.

రావిమెట్లలో యువకుడి మృతి

నిడదవోలు, జూన్ 7: నిడదవోలు మండలం రావిమెట్లలో శుక్రవారం ప్రమాదవశాత్తూ ఓ యువకుడు మృతి. దీనిపై పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు కాలేదు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు గాయాలు

కొవ్వూరు, జూన్ 7: ఐరన్‌లీడ్ లోడ్ లారీ బ్రేక్ వేయడంతో లారీ డ్రైవర్‌కు గాయాలైనట్టు హెడ్ కానిస్టేబుల్ సీహెచ్.బాబూరావు తెలిపారు. తమిళనాడు రాష్ట్రం తిరుచని జిల్లా కిరపట్టి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ దినేష్‌కుమార్ కలకత్తా నుంచి ఐరన్ లీడ్స్ లోడ్ చేసుకుని కేరళ బయలుదేరాడు. మార్గమధ్యలో శుక్రవారం ఉదయం 5గంటల సమయంలో కొవ్వూరు గామన్‌బ్రిడ్జి చేరుకునే సరికి ముందు వెళ్తున్న లారీ బ్రేక్ వేశాడు. దీంతో వెనుక వస్తున్న దినేష్ తన లారీ బ్రేక్ కొట్టడంతో వెనుకవున్న ఐరన్‌లీడ్స్ లారీ క్యాబిన్ మీదకు వచ్చేశాయి. దినేష్‌కుమార్ క్యాబిన్, ఐరన్‌లీడ్స్ మధ్యలో నలిగిపోయాడు. గాయాలపాలైన అతడిని రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుని సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

మధ్యవర్తిత్వ తర్ఫీదు శిక్షణ ముగింపు



మాట్లాడుతున్న పీడీజే సునీత

రాజమహేంద్ర వరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వ తర్ఫీదు శిక్షణ శుక్ర వారంతో ముగిసిందని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత అన్నారు.ఈ నెల 3న మధ్యవర్తిత్వ తర్ఫీదు శిక్షణ ప్రారంభించారు. ఢిల్లీ నుంచి వచ్చిన సీనియర్ శిక్షకులు వినయ్ కుమార్ గుప్తా, సునీల్ కుమార్ అగర్వాల్ ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన 30 మంది న్యాయాధికారులకు 40 గంటల పాటు తర్ఫీదు ఇచ్చారు.ఈ శిక్షణలో నేర్పించిన మెలకువల వల్ల మధ్యవర్తిత్వంలో న్యాయాధికారులకు మంచి నైపుణ్యం లభించిందని భావిస్తున్నామన్నారు. అనంతరం వినయ్ కుమార్ గుప్తా, సునీల్ కుమార్ అగర్వాల్‌ని పీడీజే సత్కరించారు.

మూడు నెలల్లో ఫ్లయ్ ఓవర్ ప్రారంభిస్తాం : వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 7: మోరంపూడి ఫ్లయ్ ఓవర్ మరొక మూడు నెలల్లో పూర్తవుతుందని అప్పుడు దినిని ప్రారంభిస్తామని రాజమహేంద్రవరం కూటమి ఎమ్మెల్యే విజేత ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులతో కలిసి శుక్రవారం మోరంపూడి ఫ్లయ్ ఓవర్‌ను పరిశీలించి మాట్లాడారు.రాజమహేంద్రవరం ఎంపీగా మురళీమోహన్ ఉన్నప్పుడు 2014-19 మధ్యలో 4 ఫ్లయ్ ఓవర్లు తీసుకొచ్చారని చెప్పారు. భరత్ రామ్ చేతకాని తనం వల్ల అవి వెనక్కిపోయాయని చెప్పారు.మోరంపూడి ఫ్లయ్ ఓవర్ ఏదో అతనే తీసుకువచ్చినట్టు సిగ్గులేకుండా చెప్పుకున్నాడని ధ్వజమెత్తారు.

నేడు మద్దిపాటి విజయోత్సవ ర్యాలీ

దేవరపల్లి, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో గోపాలపురం ఎమ్మెల్యేగా మద్దిపాటి వెంకట్రాజు గెలుపొందిన సందర్భంగా శనివారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్టు టీడీపీ మండలాధ్యక్షుడు ఆంద్రూ అనీల్ తెలిపారు. ఉదయం 8.30కు మండలంలోని గౌరీపట్నంలో ప్రారంభమయ్యే ఈ ర్యాలీ సాయంత్రం వరకూ పలు గ్రామాల్లో జరుగుతుందని, ఎమ్మెల్యే మద్దిపాటితో పాటు పలువురు నాయకులు పాల్గొంటారని, విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

కొవ్వూరును ప్రగతి పథంలో నడిపిస్తా



కొవ్వూరమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ముప్పిడి, ద్విసభ్య కమిటీ

- కూటమి ఎమ్మెల్యే విజేత ముప్పిడి వెంకటేశ్వరరావు
- కొవ్వూరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

కొవ్వూరు, జూన్ 7: మూడు పార్టీల నాయకులు, కార్యకర్తల సహకారంతో కొవ్వూరు నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తానని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరులో గ్రామదేవత కొవ్వూరమ్మ ఆలయంలో శుక్రవారం ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలకు, ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. సంక్షేమం, అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో మద్దిపట్ల శివరామకృష్ణ, పట్టణ, మండలాధ్యక్షులు దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, నాయకులు సూర్యదేవర రంజిత్, నామాన పరమేశ్వరరావు, కొఠారు వెంకట్రావు, చావా శ్రీనివాస్, పాలడుగుల లక్ష్మణరావు, అర్జిల్లి రామకృష్ణ, మద్దుల సత్యనారాయణ, బీజేపీ నాయకులు ఎం.రామచంద్రరావు, పిల్లలమర్రి మురళీకృష్ణ, బీవీ ముత్యాలరావు, జనసేన నాయకులు డేగల రాము, గంగుమళ్ల స్వామి, కొప్పాక విజయకుమార్ పాల్గొన్నారు.

'కూటమి విజయం శుభసూచికం'

రాష్ట్రంలో అరాచకపాలన అంతమొందించి కూటమి విజయం సాధించడం శుభ సూచికమని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పెనుమాక జయరాజు అన్నారు. ఎమ్మెల్యే ముప్పిడికి మంత్రివర్గంలో స్థానం కల్పించి, ఆయన విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు గుర్తింపునివ్వాలన్నారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు స్థాపించి సంపద సృష్టించాలని, రాష్ట్రానికి ప్రత్యేకహోదా తీసుకురావాలని, రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టులను పూర్తిచేయాలన్నారు.



ముప్పిడికి అభినందనలు తెలుపుతున్న కొవ్వూరు చైర్‌పర్సన్ రత్నకుమారి

ఎమ్మెల్యే ముప్పిడికి అభినందనల వెల్లువ

కొవ్వూరు/దేవరపల్లి/తాళ్లపూడి, జూన్ 7: స్థానిక టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరిలను మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపాల్టీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అలాగే లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొంతా శ్యాం రవిప్రకాష్, తాళ్లపూడి ఏఎస్‌వో, జేపీసీ చైర్మన్ జోడాల వెంకటేశ్వరరావు.. ఎమ్మెల్యే ముప్పిడిని కలిసి అభినందనలు తెలిపారు. మెగా డీఎస్సీ ఇవ్వాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమంపై దృష్టి పెట్టాలని జోడాల కోరారు. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, ఎంపీపీ కాకర్ల నారాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే దేవరపల్లిలో ఎమ్మెల్యే ముప్పిడి నివాసం వద్ద స్థానిక టీడీపీ నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో సుంకర దుర్గారావు, గద్దే సుబ్రహ్మణ్యం, కరుటూరి శ్రీనివాస్, తంగెళ్ళ మునేశ్వరరావు, రవికుమార్, యాగంటి సాయిబాబు, నందిగం బులిరాజు తదితరులున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న గౌరీపట్నం పీహెచ్‌సీ వైద్యాధికారులు

- పలు చోట్ల మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీలు

దేవరపల్లి, జూన్ 7: మండలంలోని గౌరీపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దేవరపల్లి, దుద్దుకూరు గ్రామాల్లో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో శ్రీకృష్ణుడు మాట్లాడుతూ దోమలతో మలేరియా వ్యాప్తి చెందుతుందని, ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగుకుంటలు, ఖాళీ కొబ్బరిబొండాల్లో నీరు లేకుండా చూసుకోవాలన్నారు. ఇళ్లలో ఫ్రిజ్‌లు, గ్రైండర్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ అశోక్‌కుమార్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంలో పీహెచ్‌సీ వద్ద సిబ్బందితో జరిగిన సమావేశంలో డాక్టర్ ఆర్‌ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ మలేరియా లక్షణాలు సోకిన వారు వెంటనే పీహెచ్‌సీకి రావాలన్నారు. వ్యాధి పట్ల జాగ్రత్త వహించాలని, వర్షాకాలంలో దోమలు కుట్టడం వల్ల ఈ వ్యాధి సోకే ప్రమాదముందని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, పీహెచ్‌ఎన్ కేడీఎల్ కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు

పలు పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం

తాళ్లపూడి, జూన్ 7: తాళ్లపూడి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లోని విద్యార్థులకు గ్రంథాలయ అధ్యక్షుడు గుండుబోగుల ఆదినారాయణ, రీడర్స్ ఫోరం అధ్యక్షుడు సీహెచ్ ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బహుమతులు అందించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ పుస్తకాలను చదివి విజ్ఞానం పెంచుకోవాలన్నారు. గ్రంథ పాలకుడు నరేష్ మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలు గ్రంథాలయానికి వెళ్లేలా అలవాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ నాగలింగం, పి.సత్యనారాయణ, త్రినాథ్, ప్రకాష్, ప్రసాద్ పాల్గొన్నారు.



తాళ్లపూడి గ్రంథాలయంలో బహుమతులు అందుకున్న విజేతలు



నల్లజర్లలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసిన దృశ్యం

నల్లజర్ల: నల్లజర్ల శాఖ గ్రంథాలయంలో జరిగిన వేసవి విజ్ఞాన తరగతుల ముగింపు కార్యక్రమంలో లైబ్రేరియన్ రమణ మాట్లాడుతూ విద్యార్థులకు జ్ఞానాభివృద్ధి, పుస్తక పఠనం, మనోవికాసభివృద్ధి వంటి అంశాలపై అవగాహన కలిగించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు గొట్టిపాటి శ్రీరామూర్తి చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్స్ అందించారు. కార్యక్రమంలో మద్దిపాటి నాగ వరప్రసాద్, శ్రీహరి, ఖాన్ బాజీ, యర్రా సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

శస్త్ర చికిత్స విధానంలో 'ఫ్యూజ్' కీలకం

- ప్రఖ్యాత అమెరికా వైద్య నిపుణుడు డాక్టర్ జైసా ఓలాస్కీ
- జీఎస్ఎల్‌లో ఘనంగా ప్రారంభమైన వర్క్‌షాప్



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యఅతిథులు

రాజానగరం, జూన్ 7: శస్త్ర చికిత్సా విధానంలో ఫండమెంట్ యూజ్ ఆఫ్ సర్జికల్ ఎనర్జీ(ఫ్యూజ్)ఎంతో కీలకమని ప్రఖ్యాత అమెరికా వైద్య నిపుణులు డాక్టర్ జైసా ఓలాస్కీ అన్నారు. రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, అమెరికా గాస్ట్రో ఇంటెస్టినల్, ఎండోస్కోపిక్ సర్జన్ల సొసైటీ(ఎస్ఏజీఈఎస్) సంయుక్తంగా జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఫ్యూజ్ వర్క్‌షాప్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ జైసా ఓలాస్కీ మాట్లాడుతూ శస్త్ర చికిత్సా పరికరాలను సమర్థవంతంగా ఉపయోగించడంలో సాధన అవసరమన్నారు. రోగులకు నిర్వహించే శస్త్ర చికిత్సల్లో ఫ్యూజ్ విధానం వినియోగాన్ని వివరించారు. మరో ముఖ్యఅతిథి న్యూయార్క్‌కు చెందిన డాక్టర్ జాకబ్స్ స్కూల్ ఆఫ్ మెడిసిన్, ప్రొఫెసర్ ఫ్యూజ్ కోర్సు స్థాపకుడు డాక్టర్ స్టీవెన్ షైట్జ్‌బర్గ్ మాట్లాడుతూ ఫ్యూజ్ కోర్సును వినియోగించుకుని రోగుల భద్రత, శస్త్ర చికిత్స పనితనం మెరుగుపర్చుకోవాలన్నారు. ఈ వర్క్‌షాప్ ద్వారా నైపుణ్యాలను, జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. నూతన కోర్సు మూలాలు, ప్రయోజనాలను వివరించారు. మరో అతిథి సట్టర్ ఈస్ట్ బే మెడికల్ గ్రూప్, సాన్ ఫ్రాన్సిస్కో జనరల్ సర్జన్ డాక్టర్ పాస్కల్ ఫుచ్‌షుబెర్, యూనివర్శిటీ ఆఫ్ కొలరెడో హాస్పిటల్, డెన్వర్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ సర్జరీ వైద్యులు డాక్టర్ ఎడ్వర్డ్ జోన్స్, స్టోనీ బ్రూక్ యూనివర్శిటీ హాస్పిటల్ (న్యూయార్క్) జనరల్ సర్జన్ డాక్టర్ కింగా పవర్స్ తదితర సీనియర్ సర్జన్లు ఫ్యూజ్ కోర్సు ప్రాముఖ్యతను వివరించారు. అలాగే జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో కల్పించిన ఆధునిక సిమ్యులేటర్ పరికరాలు వైద్య విద్యార్థులకు ఎంతగానో దోహదపడతాయన్నారు. దీనిపై జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు తమ సంస్థలో నిర్వహించే వివిధ శస్త్ర చికిత్సా పరికరాలు, శస్త్ర చికిత్సా ఫలితాలను మెరుగుపర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. కాగా రెండు రోజులపాటు జరుగనున్న ఫ్యూజ్ వర్క్ షాప్‌ను ముఖ్యఅతిథి డాక్టర్ జైసా ఓలాస్కీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం అతిథులను జీఎస్ఎల్ యాజమాన్యం ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేసింది.

అధికార పార్టీ నాయకులకు అభినందనలు



తీపర్రులో కూటమి నాయకులకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న అధికారులు

పెరవలి, జూన్ 7: ప్రజాప్రతినిధిగా ఉన్నప్పటికీ తనకు సంబంధించిన పార్టీ రాష్ట్రంలో అధికారంలో లేకపోతే ఏ అధికారి మాట వినరు. పదవిలో ఉన్నా లేకున్నా అధికార పార్టీలో ఉంటే చాలు.. సముచిత గౌరవం దక్కుతుందని అనేందుకు ఈ సంఘటన ఉదాహరణ. గ్రామాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు సక్రమంగా అమలు కావాలంటే పార్టీ కార్యకర్తలు, గ్రామస్థాయి అధికారుల మధ్య సమన్వయం అవసరం. దీనికి తగ్గట్టుగానే తీపర్రులో గ్రామస్థాయి ప్రభుత్వ అధికారులు కొత్త ప్రభుత్వం రానుండడంతో గ్రామంలోని టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్య నాయకులను కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందలను తెలిపారు.



కూటమి విజయం.. మహిళల ఆనందం

గోపాలపురం, జూన్ 7 : సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయాన్ని సాధించి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయబోతున్న టీడీపీ జాతీయ అధినేత చంద్రబాబు చిత్రపటానికి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కాకర్ల రామతులసి ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. చంద్రబాబుపై మహిళలకు ఏర్పడిన నమ్మకంతో రాష్ట్ర వ్యాప్తంగా సైకిల్ సునామీ సృష్టించిం దన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 164 స్థానాల్లో విజయదుందుభి మోగించిందన్నారు. మహిళా పక్షపాత్రి ప్రభుత్వంగా టీడీపీ ఉంటుందన్నారు. ఎమ్మెల్యే విజేత మద్దిపాటి వెంకటరాజుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఎన్డీఏ పక్ష నేతగా మోదీ ఎన్నికపై హర్షం

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 7: ఎన్‌డీఏ పక్ష పార్లమెంట్ నేతగా నరేంద్రమోదీ ఏకగ్రీవంగా ఎన్నికవడం పట్ల బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ బాణసంచా కాల్చి ఆనందం పంచుకున్నారు. ఈ మేరకు శుక్రవారం రాజమండ్రి బీజేపీ కార్యాలయం వద్ద పలువురు నాయకులు మోదీ మూడో సారి ప్రధాని పదవి చేపడుతున్నందున శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రొంగల గోపి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడబాల రామకృష్ణారావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కురగంటి సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పన్నాల సంతోషి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావును కలిసిన ఎమ్మెల్యే శిరీష

కడియం, జూన్ 7: రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి శుక్రవారం వేమగిరి విచ్చేశారు. ఈ సందర్భంగా రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకుడు, టీడీపీ రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసేందుకు వచ్చినట్టు ఆమె తెలిపారు.

నారా లోకేశ్‌ను కలిసిన యర్రా



రాజమహేంద్రవరం సిటీ, జూన్ 7: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాల రాయుడు మంగళగిరిలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

చట్ట పరిధిలో అందరూ సమానమే : డీఎస్పీ

రాజమహేంద్రవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): చట్ట పరిధిలో అందరూ సమానమనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సౌత్ జోన్ డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ హెచ్చరించారు. ప్రజలు సంయమనం కోల్పోవద్ద న్నారు. అనవసర ఆవేశాలు, ఉద్వేగాలతో హింస చెలరేగే విధంగా ప్రవర్తిం చవద్దన్నారు. రౌడీయిజం, దౌర్జన్యం ఎవరు చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశాంతంగా ఉండే ఈ ప్రాంతంలో మాటలు, చేతల ద్వారా అలజడి సృష్టిస్తే ఉపేక్షించేది లేదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా నడుచుకోవద్దని రెండో పట్టణ, ధవళేశ్వరం, కడియం పోలీస్ స్టేషన్ల పరిధిలోని వారికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

ఆహారంలో లోపాలుంటే కేసులు : రుక్కయ్య

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 7: ఆహారంలో ఎటువంటి లోపాలు ఉన్నా కేసులు నమోదు చేస్తామని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వి.రుక్కయ్య అన్నారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం క్వారీ సెంటర్ రైతు బజార్‌లో శుక్రవారం ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏడీ ఎం.వినయ్ సునీల్, విజిలెన్స్ కమిటీ సభ్యులు ధర్నాలకోట వెంకటేశ్వరరావు, కెవి రమణ, అమరవాది రామకృష్ణ, రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్, రైతులు వ్యాపారులు, వినియోగదారులు పాల్గొన్నారు.

గోరంట్లను కలిసిన చినరాజప్ప



రాజమహేంద్రవరం రూరల్, జూన్ 7: రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యేగా భారీ విజయాన్ని కైవసం చేసుకున్న గోరంట్ల బుచ్చయ్యచౌదరిని పెద్దాపురం ఎమ్మెల్యేగా విజయం సాధించిన నిమ్మకాయల చినరాజప్ప శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను గోరంట్ల సత్కరించారు. అలాగే బుచ్చయ్యచౌదరిని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, అధికారులు, ప్రజలు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలతో సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీగా ప్రజలు తరలి రావడంతో ఆయన నివాసం కిక్కిరిసి సందడిగా మారింది.

నెహ్రూకు మంత్రి పదవి కోసం పాదయాత్ర

గోకవరం, జూన్7: జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు మంత్రి పదవి దక్కాలని ఆకాంక్షిస్తూ ఆయన అభిమాని విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం వరకు పాదయాత్ర చేపట్టాడు. మండలంలోని గంగంపాలెం మాజీ ఎంపీటీసీ సాలెపు నలమహరాజు.. ఎమ్మెల్యే నెహ్రూ అభిమాని. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయన గెలుపునకు కృషి చేశాడు. ఈ క్రమంలోనే నెహ్రూకు మంత్రి పదవి కూడా దక్కాలంటూ గంగంపాలెం నుంచి విజయవాడకు పాదయాత్రగా శుక్రవారం బయలుదేరాడు. ఆతడికి ఎమ్మెల్యే కోడలు లక్ష్మీదేవి, మనుమడు అనీష్ నెహ్రూ, స్థానిక టీడీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మంగరౌతు రాము, పాలూరి బోస్, కోట సత్యవతి, మండిగ గంగాధర్, బత్తుల ప్రసాద్ పాల్గొన్నారు.

అనుమతుల్లేని ఇసుక ట్రాక్టర్ సీజ్

సీతానగరం, జూన్ 7: ఏ విధమైన అనుమతులు లేకుండా మండలంలోని సింగవరంలోని అనధికార ర్యాంపు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం అర్ధరాత్రి ఎస్ఐ టి.రామకృష్ణ పట్టుకుని సీజ్ చేశారు. సింగవరం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్థానికులు అడ్డుకుని ఎస్ఐకు సమాచారం ఇవ్వడంతో ట్రాక్టర్ సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. లంకూరుకు చెందిన ట్రాక్టరుగా గుర్తించారు. ఇందుకు సంబంధించిన రిపోర్టును స్థానిక తహశీల్దార్ బి.నెల్సన్ పాల్‌బాబుకు అందించారు. రిపోర్ట్‌ను పరిశీలించిన అనంతరం చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ తెలిపారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం



రంగంపేట, జూన్ 7: స్థానిక శాఖా గ్రంథాలయంలో 25 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం ముగిసింది. శిబిరంలో నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముందుగా గ్రంథాలయ ఉద్యమకారులైన అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్.ఆర్ రంగనాథన్ నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వజ్రపు వెంకటరమణ మాట్లాడుతూ పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. గ్రంథాలయాధికారి నల్లమిల్లి రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పీవీ సాయిప్రసాద్, ఎమ్.రామభద్రరావు, టి.శ్రీనివాస్, పలువురు పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	లవ్ మీ
వై.స్క్రీన్ 2	గంగం గణేశా
దేవిశ్రీ(గాయత్రి)	భజే వాయువేగం
అనన్య	గ్యాంగ్ ఆఫ్ గోదావరి
నిడదవోలు	
వీ మ్యాక్స్	గ్యాంగ్ ఆఫ్ గోదావరి
రాధాకృష్ణ	భజే వాయువేగం
శ్రీగణపతి	మనమే
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	మనమే
శ్రీరామ్ సినీ మ్యాక్స్	మనమే
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	గంగం గణేశా
స్క్రీన్ 2	---
శ్రీనివాస	---